RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 29 ఆగస్ట్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:79



జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ.

# బంగారం మైనింగ్ లో హట్టి-సింగరేణి జతకట్టాలి

**భవిష్యత్తు ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్ గా కలిసి పని చేయడానికి పరిశీలన చేయాలి**

**సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశ నిర్దేశం**

**బంగారం శుద్ధి కేంద్రం పరిశీలన, హట్టి, యుటీ బంగారు గనులలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్తృత పర్యటన.**



బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు.

మిగతా 2 లో

# రాయదుర్గ్ భూముల వేలంలో రికార్డ్

**ఎకరాకు రూ.266.53 కోట్లు..**

**రిజర్వ్ ధరపై 52.3 శాతం ప్రీమియం**

హైదరాబాద్, ఆగస్టు 28:హైదరాబాద్‌లోని రాయదుర్గ్ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన తాజా భూముల వేలం భారీ స్పందనను లభించింది. రాయదుర్గ్ లోని 5.38 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్లాట్–పీ2ను ఎకరాకు రూ.269 కోట్ల ధరకు వేలం వేయగా.. మొత్తం రూ.1,447.22 కోట్ల ఆదాయం లభించింది. ఇదే క్రమంలో గత వారం నిర్వహించిన ప్లాట్–పీ1 వేలం కూడా అత్యంత భారీ ధరను నమోదు చేసింది. 5.25 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ ప్లాట్ ఎకరాకు రూ.264 కోట్ల ధర పలకగా.. మొత్తం రూ.1,386 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో వేలం విలువలో 25 శాతం మొత్తాన్ని తొలి దశ చెల్లింపుగా ఇప్పటికే ప్రభుత్వం అందుకుంది. తాజాగా నిర్వహించిన పీ2 వేలం ఫలితాన్ని, గత వారం పీ1 వేలం ఫలితాన్ని కలిపి చూస్తే.. కేవలం 10.63 ఎకరాల భూమి ద్వారా టీజీఐఐసీకి ఏకంగా రూ.2,833.22 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ రెండు వేలాల్లో ఎకరాకు సగటున రూ.266.53 కోట్ల ధర లభించడం విశేషం.

మిగతా 3 లో

# ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం--పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు.ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50--60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10--15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోం దన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.

మిగతా 2 లో

**తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.**



గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ గారిని ఈరోజు సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.



రాఖీ పర్వదినం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి తన సోదరి జగదీశ్వరి రాఖీ కట్టి ఆశీర్వాదం ఇచ్చారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



వార్త 5 లో



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )**రక్షాబంధన్ సందర్భంగా ఈరోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి , తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క తో కలిసి రాఖీ కట్టిన ఖైరతాబాద్ జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్.

ప్రజాబలం

29 ఆగస్ట్ 2026 శనివారం

# బంగారం మైనింగ్ లో హట్టి-సింగరేణి జతకట్టాలి



మొదటి పేజీ తరువాయి

హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు.

బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

ఆర్థిక భద్రతలో బంగారం కీలకం

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు.

బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి--సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు.

ఉత్పత్తి నుంచి శుద్ధి వరకు పరిశీలన

హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు.

'యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు.అనంతరం యుటీ భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు.భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

?ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ ?రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మొదటి పేజీ తరువాయిగతంలో పేదలకు ఇళ్లు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30--40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు మరియు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో "పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు.

స్థానిక శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు.

## ఇటీవలే మరణించిన పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన భువనగిరి ఎంపీ చామల



భువనగిరి నియోజకవర్గం భువనగిరి పట్టణంలోని బాగాయత్ స్కూల్ లో చెట్టు కూలి చనిపోయిన కీ"శే"అలీన (తండ్రి అస్మత్ ) అనే విద్యార్థిని ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ తో చరవాణిలో మాట్లాడి విద్యార్థిని తండ్రి అస్మత్ కి ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని అలాగే కిరాయి ఇంట్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆదేశించారు.

తుంగతుర్తి నియోజకవర్గం అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవి కాల్వ గ్రామంలో ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీ"శే" శ్రీ వల్లంబట్ల వేణు గారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబాన్ని ఓదార్చారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీ"శే" శ్రీ పొన్నాల వెంకన్న గారు ఇటీవలే అనారోగ్యంతో మరణించారు, వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

జాజిరెడ్డిగూడెం మండలం కోడూరు గ్రామ సర్పంచ్ శ్రీ వల్లపు అవిలమ్మ భర్త కీ"శే" వల్లపు సోమయ్య గారు ఇటివలే మరణించారు వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు.

తిమ్మాపురం గ్రామంలో ఇటివలే కీ" శే" శ్రీ షేక్ రహిమాన్ గారు కరెంట్ షాక్ తో మరణించారు వారి కుటుంబాన్ని పరామర్శించారు.

జనగాం నియోజకవర్గం

జనగాం మండలం పెద్ద రామచర్ల గ్రామం ఇటీవలే మరణించిన పెద్ద రామచర్ల గ్రామ సర్పంచ్ ఙ జనగామ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీ వల్లాల మల్లేష్ గారి కుటుంబాన్ని పరామర్శించి వారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు.

ఓబుల్ కేశాపురం గ్రామంలో మరినించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కీ"శ్రీ " శ్రీ బోచ్చు శ్రీకాంత్ మృతదేహాన్ని కి కాంగ్రెస్ కండువా కప్పి నివాళులు అర్పించారు,శోక సంద్రంలో ఉన్న కుంటుంబానికి ఓదార్చారు.వారి పిల్లలు చదువులకు కావలసిన సహయ సహకారాలు అందిస్తామని భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు అన్నారు.

# చేసిన పాపాలే..శాపాలై..

నేపాల్‌లో సంభవించిన ఘోరమైన వరదలు, భోటేకోషి , త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల్లో సృష్టించిన బీభత్సం వెనుక చైనా కక్కుర్తి ఉందన్న విమర్శలు వస్తున్నాయి. భూభాగ సరిహద్దుల వివాదాలు మరి, కట్టడాల వల్లనే ఈ వరదలన్న అభిప్రాయం వినిపిస్తోంది. చైనా టిబెట్ సరిహద్దు వద్ద నిర్మిస్తున్న మౌలిక వసతులు, డ్యామ్‌లు , నియంత్రణ లేని నిర్మాణ కార్యకలాపాల వల్ల ప్రవాహాలు మళ్లి నేపాల్ వైపు ముంచెత్తుతున్నాయని, అందుకే ఈ విపత్తుకు చైనా విధానాలే పరోక్ష కారణమనే ప్రచారం ఊపందుకుంది.ఈ విపత్తుకు కేవలం మానవ తప్పిదాలే కాకుండా హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులు ప్రధాన కారణమని తేలింది. అంతర్జాతీయ సమగ్ర పర్వత అభివృద్ధి కేంద్రం అధ్యయనాల ప్రకారం టిబెట్-నేపాల్ సరిహద్దులోని లెండే ఖోలా ప్రాంతంలో భారీ మంచు , రాళ్ల కొండచరిలు విరిగిపడటమే ఈ హఠాత్ వరదలకు ముఖ్య చోదక శక్తిగా మారింది.మరోవైపు అంతర్జాతీయ పర్యావరణ వేత్తలు చైనాపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిబెట్ పీఠభూమిపై విస్తృతంగా జరుగుతున్న ఆనకట్టల నిర్మాణం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుల విస్తరణ , ఎగువ భాగాల్లో సమాచార వ్యవస్థలను నేపాల్ వంటి దిగువ దేశాలతో సరిగ్గా పంచుకోకపోవడం చైనా పెద్ద తప్పిదమని విమర్శిస్తున్నారు. నదీ ప్రవాహ డేటాను దాచిపెట్టడం వల్ల నేపాల్ ప్రజలు సకాలంలో అప్రమత్తం కాలేకపోతున్నారని అంతర్జాతీయ మీడియా ఎండగట్టింది.ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు? పర్యావరణ పరిరక్షణను పక్కనపెట్టి చైనా హిమాలయాల్లో సరిహద్దు వెంట చేపడుతున్న మౌలిక ప్రాజెక్టులే పదేపదే ఇలాంటి ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాద నివారణకు చైనా సరిహద్దు దేశాలతో పారదర్శకమైన వాతావరణ సమాచారాన్ని పంచుకోవాలని, ఆనకట్టల నిర్మాణ భద్రతపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అంతర్జాతీయ సమాజం డిమాండ్ చేస్తోంది.సుమారు 2,000 అడుగుల వెడల్పు ఉన్న ఆ హిమానీనదంలోని ఒక భాగం అకస్మాత్తుగా విరిగి, 4,000 అడుగుల లోతున ఉన్న లోయలోకి పడింది. అది 5.2 తీవ్రతతో భూకంపం లాంటి ప్రకంపనలను సృష్టించేంత శక్తివంతమైంది. ఆ ప్రకంపనలు ఎంత బలంగా ఉన్నాయంటే, యుఎస్ జియోలాజికల్ సర్వే మొదట దానిని భూకంపంగా పొరపాటుపడింది. తర్వాత భూకంపం కాదని నిర్ధారించుకున్నారు. ఆ హిమానీనదం కూలిపోవడమే భూకంప తరంగాలను సృష్టించింది. ఆ తర్వాత జరిగిన విధ్వంసం మాటలకు అందనిది...ఇదంతా లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతాల ఉత్తరపు వాలు ప్రాంతాల్లో మొదలైంది. గూగుల్ ఎర్త్, ప్లానెట్ ల్యాబ్స్, నేపాల్ నేచురల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ వారి ఉపగ్రహ చిత్రాల ప్రకారం, ఆ ప్రాంతం ఒక భారీ హిమానీనదంతో కప్పి ఉంది. సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ హిమానీనదం దిగువ భాగం అకస్మాత్తుగా విడిపోయి, కింద ఉన్న లోయలోకి 4,000 అడుగుల లోతు నుంచి పడిపోయింది.దీని వల్ల విడుదలైన శక్తి హిరోషిమా అణు విస్ఫోటనం శక్తిలో సుమారు 6.3 శాతంగా అంచనా వేశారు. ఇది ఎంత శక్తివంతమైనదంటే, మొదట దీనిని 4.4 తీవ్రత గల భూకంపంగా భావించింది. ఆ తర్వాత, మరింత లోతుగా దర్యాప్తు చేస్తే ఇది భూకంపం కాదని, ఒక హిమానీనదం కూలిపోవడం వల్ల కలిగిన 5.2 తీవ్రత గల ప్రకంపన అని వెల్లడైంది. అంటే, మంచు పొర కూలిపోవడంతో వల్ల భూకంపం వంటి ప్రకంపనలను సృష్టించిందిఈ భారీ మంచు కొండ లోయలోకి కూలినప్పుడు, అది భోటే కోషి నదికి ఉపనది అయిన లెండే ఖోలా నదిని పూర్తిగా అడ్డుకుంది. దీనివల్ల ఒక సహజ ఆనకట్ట ఏర్పడి, దాని వెనుక భారీగా వరద నీరు పేరుకుపోయింది. ఈ మంచు ఆనకట్ట ఎక్కువ సేపు ఉండలేదు. కరిగిపోయింది. నదీ జలాలు, బురద, రాళ్లతో కలిసి ఒక భయంకరమైన పరిస్థితిని సృష్టించింది. ఆనకట్ట తెగినప్పుడు, బయటకు ప్రవహించింది కేవలం నీరు మాత్రమే కాదు. అది బురద, రాళ్ళు, మంచు, శిథిలాలతో కూడిన ఒక భయంకరమైన తుపాను పరిస్థితిని క్రియేట్ చేసింది. నిపుణులు దానిని "లిక్విడ్ కాంక్రీటు"గా వర్ణించారు. అది ఎంత శక్తివంతంగా ఉందంటే, దానిని ఆపడం అసాధ్యమైంది. 100 అడుగుల ఎత్తైన ఈ సునామీ లాంటి అల, లెండే ఖోలా, భోటే కోషి, ఆ తర్వాత త్రిశూలి నది గుండా వేగంగా దూసుకెళ్లింది.వరద అన్నింటినీ ఊడ్చేసింది. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడాతో సహా రెండు డజన్ల దేశాలకు చెందిన 579 మంది పర్యాటకులతో కలిపి సుమారు 826 మంది గల్లంతయ్యారు. టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీలో 558 మంది గల్లంతయ్యారని చైనా మీడియా నివేదించింది. కొన్ని నివేదికల ప్రకారం గల్లంతైన వారి సంఖ్య 1,000కి పైగా ఉంది.లాంగ్‌టాంగ్ ట్రెకింగ్ మార్గానికి స్టార్టింగ్ పాయింట్ అయిన స్యాబ్రుబేసి ధ్వంసమైంది. కైలాష్ మానస సరోవర యాత్ర మార్గాలు కూడా మూతపడ్డాయి. నేపాల్‌లోని రసువా జిల్లాలో దాదాపు 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితం కాగా, తొమ్మిది బ్యాంకు శాఖలు కొట్టుకుపోయాయి. 26 మంది ఉద్యోగులు ఇప్పటికీ గల్లంతయ్యారు.ఇది కేవలం ఒక ప్రమాదం కాదు. ఒక పెద్ద మార్పుకు సంకేతం. హిమాలయాల్లోని హిందూ కుష్ ప్రాంతం ప్రపంచ సగటు కంటే వేగంగా వేడెక్కుతోంది. 2023 నాటి ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, గత 30 ఏళ్లలో నేపాల్‌లోని మంచుతో కప్పి ఉన్న శిఖరాలు తమ మంచులో దాదాపు మూడింట ఒక వంతును కోల్పోయాయి. గత దశాబ్దంతో పోలిస్తే, ఈ దశాబ్దంలో హిమానీనదాల కరిగిపోవడం 65 శాతం వేగవంతమైంది.ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్ ప్రకారం, హిందూ కుష్-హిమాలయ ప్రాంతమంతటా వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమపాతాలు పెరుగుతున్నాయి. ఒక్క నేపాల్‌లోనే 47 హిమానీనద సరస్సులు ఉన్నాయి, అవి ఏ క్షణంలోనైనా విస్ఫోటనం చెందగలవు, అందుకే వాటిని "టైమ్ బాంబులు" అని పిలుస్తున్నారు.హిమాలయాల భూగర్భ నిర్మాణం ఇప్పటికే అస్థిరంగా ఉందని నిపుణులు అంటున్నారు. భారత, యూరేషియన్ ఫలకాలు ఇప్పటికీ ఢీకొంటూ ఉండటం వల్ల, హిమాలయాలు సంవత్సరానికి 40-50 మిల్లీమీటర్ల మేర పైకి లేస్తున్నాయి. ఈ అస్థిరమైన భూభాగానికి గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు కూడా తోడైనప్పుడు, ఇలాంటి ఘటనలు మరింత తరచుగా జరుగుతాయి.ఈ విషాదం 2015లో లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతం దక్షిణ వాలు నుంచి కొండచరియ విరిగిపడి దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయిన 7.8 తీవ్రత గల భూకంపంను గుర్తుచేస్తోంది. ఇప్పుడు, అదే పర్వతం మరోసారి వినాశనానికి కారణమైంది.వరద నీరు ఎంత బలంగా, భారీగా ఉందంటే, శిథిలాలు దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణి నదిని చేరుకున్నాయి. నేపాల్ ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థసహాయక, రెస్క్యూ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. ప్రశ్న ఏమిటంటే: భవిష్యత్తులో రాబోయే ఇలాంటి ఘటనలకు మనం సిద్ధంగా ఉన్నామా? పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కరుగుతున్న హిమానీనదాలు తీవ్రమవుతున్న అస్థిరత హిమాలయాలను ప్రమాదకరమైన ప్రాంతంగా మారుస్తున్నాయి.

# జపాన్ సంస్థతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' భాగస్వామ్యం

**హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో సూత్రప్రాయ అంగీకారం**

**ఇంజినీరింగ్ విద్య, విద్యార్థుల పరస్పర మార్పిడి, అధ్యాపకుల శిక్షణపై సహకారం**

**అధునాతన తయారీ, ఆటోమొబైల్, ఏఐ, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్ రంగాల్లో కలిసి పనిచేసేలా కార్యాచరణ**

**తెలంగాణ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు**

**హైదరాబాద్‌కు రావాలని హెచ్ఐటీ ప్రతినిధులకు మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానం**

**డిసెంబరులో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు రావాలని ఆహ్వానం**



తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలను అందించేందుకు జపాన్‌లోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తున్నామని శక్తి మరియు గనులు శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హెచ్ఐటీ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) మధ్య భాగస్వామ్యానికి సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు.

జపాన్ పర్యటనలో భాగంగా మంత్రి వివేక్ వెంకటస్వామి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం శుక్రవారం హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థ నాయకత్వంతో తెలంగాణలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల తయారీపై విస్తృతంగా చర్చించింది.

తొలిదశలో పరస్పర అవగాహనతో భాగస్వామ్యాన్ని ప్రారంభించి.. తెలంగాణకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతికత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సహకార రంగాలను సంయుక్తంగా గుర్తించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి.

హెచ్ఐటీ--వైఐఎస్‌యూ భాగస్వామ్యంలో విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాన్ని కీలకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా తెలంగాణ విద్యార్థులకు జపాన్‌లోని సాంకేతిక విద్యా విధానం, ప్రయోగశాల ఆధారిత శిక్షణ, పరిశ్రమలతో అనుసంధానమైన విద్యా విధానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశాలు కూడా కల్పించనున్నారు.

అధ్యాపకులు, శిక్షకుల నైపుణ్యాభివృద్ధి, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ), స్వల్పకాలిక సాంకేతిక కోర్సులు, పరిశోధన, పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం వంటి అంశాల్లోనూ సహకారాన్ని పరిశీలించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. తెలంగాణలో స్థానిక అవసరాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్య రంగాలను ఎంపిక చేయనున్నారు.అధునాతన తయారీ, మొబిలిటీ, ఆటోమొబైల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్, డిజిటల్ టెక్నాలజీలు, పర్యావరణ సాంకేతికత వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం పెంచుకోవడంపై చర్చించారు. హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ రంగంలోని సామర్థ్యాలు.. తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అనుకూలంగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.కేవలం సంప్రదాయ విద్యా మార్పిడికి పరిమితం కాకుండా.. నైపుణ్యాలు, ఉపాధి సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పరిశ్రమల అవసరాలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ సాంకేతికత, తయారీ రంగం, పరిశ్రమల ఆధారిత విద్యా విధానంలోని ఉత్తమ పద్ధతులను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని అన్నారు.తరగతి గది, ప్రయోగశాల విద్యను వాస్తవ పరిశ్రమల సవాళ్లు, పరిశోధనతో అనుసంధానించే హెచ్ఐటీ విధానంపై తెలంగాణ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి చూపింది. ఇలాంటి విధానాలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణ సాంకేతిక విద్యా వ్యవస్థలో ఎలా అమలు చేయవచ్చనే అంశంపై చర్చించారు.

హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానం

హెచ్ఐటీ ప్రతినిధులను హైదరాబాద్‌కు వచ్చి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని సందర్శించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. తదుపరి చర్చల ద్వారా భాగస్వామ్యానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026'లో పాల్గొని.. తెలంగాణతో మరిన్ని సంస్థాగత, పారిశ్రామిక భాగస్వామ్యాలను పరిశీలించాలని హెచ్ఐటీ ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు.జపాన్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలతో నేరుగా సంస్థాగత సంబంధాలను ఏర్పరచుకోవడంలో ఈ భాగస్వామ్యం మరో కీలక ముందడుగని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సాంకేతిక విద్య, నైపుణ్యాలు, పరిశ్రమల అనుభవాన్ని తెలంగాణ యువతకు అందించేందుకు ఇటువంటి భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు శ్రీకారం

## మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 28:** తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేడుకల్లో భాగంగా తొలిరోజు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీడా రంగానికి చెందిన అధికారులు, సిబ్బంది, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా రంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రానున్న రెండు రోజుల్లోనూ వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్‌రెడ్డి తెలిపారు.

## అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతిరూపం రక్షాబంధన్.

## అన్నకు రాఖీ కట్టిన మాజీ వార్డ్ మెంబర్ మంచాల రాణి.



**ఖమ్మం జిల్లా ప్రజాబలం ఆగస్టు 28:** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను మాజీ వార్డు సభ్యులు మంచాల రాణి ఘనంగా నిర్వహించారు. అనంతరం మంచాల రాణి మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతులకు రాఖీలు కట్టి, వారు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సోదరులు కూడా తమ సోదరీమణులకు బహుమతులు అందించి, జీవితాంతం వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.రక్షాబంధన్ సందర్భంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రేమ ఆప్యాయతలను పంచాలని తెలిపారు.రాఖీ కట్టడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా సోదరసోదరీ మణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. కుటుంబ విలువలు, ఆత్మీయ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు.

# రాయదుర్గ్ భూముల వేలంలో రికార్డ్

## ఎకరాకు రూ.266.53 కోట్లు.. రిజర్వ్ ధరపై 52.3 శాతం ప్రీమియం

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడిదారుల నమ్మకానికి నిదర్శనం

కేవలం వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన రెండు వేలాల్లోనూ ఎకరాకు రూ.260 కోట్లకు పైగా ధర పలకడం రాయదుర్గ్ ప్రాంతంపై పెట్టుబడిదారులలో ఉన్న బలమైన ఆసక్తికి అద్దం పడుతోంది. రాయదుర్గ్ కారిడార్‌పై ప్రముఖ డెవలపర్లు, పెట్టుబడిదారుల్లో ఉన్న విశ్వాసాన్ని ఈ ధరల వెల్లడి స్పష్టంగా చాటుతోంది. హైదరాబాద్ భవిష్యత్ వృద్ధి అవకాశాలపై పెట్టుబడిదారుల్లో బలమైన నమ్మకం ఉందని ఈ వేలం ఫలితాలు వెల్లడిస్తున్నాయి. విస్తరిస్తున్న వ్యాపార వ్యవస్థ, మెరుగైన మౌలిక వసతులు, రవాణా అనుసంధానం, దేశంలోని ప్రముఖ వ్యాపార--పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం.. ఇవన్నీ రాయదుర్గ్ భూములకు భారీ డిమాండ్‌కు కారణమయ్యాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామం హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత చురుకైన, ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ఒకటిగా మరోసారి నిలబెట్టిందని టీజీఐఐసీ వర్గాలు తెలిపాయి.

ప్రజా ప్రభుత్వ విధానాలకు ప్రశంసలు

ఈ రికార్డు జరిగిన సందర్భంగా టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే. శశాంక, ఐఏఎస్ మాట్లాడుతూ... హైదరాబాద్, తెలంగాణపై పెట్టుబడిదారుల విశ్వాసానికి తాజా వేలం బలమైన నిదర్శనమని అన్నారు. రాయదుర్గ్ ప్రాంతం అత్యుత్తమ వ్యాపార, పెట్టుబడి గమ్యస్థానంగా కొనసాగుతున్న విషయాన్ని ఈ వేలం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. వ్యూహాత్మకంగా కీలక ప్రాంతాల్లో ఉన్న భూములకు ఎంతటి డిమాండ్ ఉందో ఈ ధరలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. పారదర్శకమైన, పోటీతో కూడిన వేలం ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూములకు ఉన్న విలువను గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉందని శశాంక తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు, నిరంతర మౌలిక వసతుల అభివృద్ధి ఈ విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు.

ఎంఎస్‌టీసీ వేదికగా వేలం

ఈ భూముల వేలం ప్రక్రియను ఎంఎస్‌టీసీ ఈ-ఆక్షన్ వేదిక ద్వారా నిర్వహించారు. టీజీఐఐసీకి ప్రత్యేక లావాదేవీ సలహాదారుగా జేఎల్ఎల్ వ్యవహరించింది. మార్కెట్‌లో భూములకు సరైన స్థానం కల్పించడం, పెట్టుబడిదారులను ఆకర్షించడం, వారితో అనుసంధానం చేయడం, పోటీ ధరల వెల్లడి జరిగేలా చూడడంలో జేఎల్ఎల్ కీలక సహకారం అందించింది.

ప్రభుత్వ ఆస్తులకు భారీ విలువ

రాయదుర్గ్ లో జరిగిన ఈ రెండు వేలాల సమిష్టి ఫలితం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వ్యూహాత్మక భూముల నగదీకరణ ప్రక్రియలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. వ్యూహాత్మకంగా కీలక ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పారదర్శకంగా, మార్కెట్ ఆధారిత విధానంలో వేలం వేయడం ద్వారా భారీ విలువను సృష్టించవచ్చని ఈ ఫలితాలు చాటిచెబుతున్నాయి. కేవలం 10.63 ఎకరాల భూమితో రూ.2,833.22 కోట్ల ఆదాయం రావడం రైదుర్గ్ ప్రాంతానికి ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని, హైదరాబాద్ పెట్టుబడి గమ్యస్థానంగా సాధిస్తున్న బలాన్ని మరోసారి స్పష్టం చేసింది.

### గోల్డ్ మెడల్ సాధించిన పరుగుల రాణి.

కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నల్లవెల్లి ఆనంది బంగారు పతకం సాధించారు. హనుమకొండ జేఎన్ఎం స్టేడియంలో 12 తెలంగాణ స్టేట్ మీట్ సౌత్ జోన్ అథెనెటిక్ ఛాంపియన్షిప్ 18 ఇయర్స్ విభాగంలో 400 మరియు 200 మీటర్స్ రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ సాధించి సెప్టెంబర్ నెల పాండిచేరిలో జరిగే సౌత్ జోన్ నేషనల్ మీట్ కు నల్లవెల్లి ఆనంది ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి కోచ్ సుబ్బారావుఆనందిని అభినందించినారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజులైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యుడు లయన్ జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

కడప, ఆగస్టు 28,రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ఖ4 మోడల్‌లో రూపొందించారు. ఐఐటీలు, ఐఐఎంల నిపుణులు, గ్లోబల్ టెక్ కంపెనీల అధిపతులతో విద్యార్థులు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్ ఇచ్చేలా దీనికి శ్రీకారం చుట్టారు.ఈ స్టార్టప్ హబ్ నిర్మాణాన్ని కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉ+3 ఆకృతిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ రూ. 3 కోట్లు మంజూరు చేయగా, ప్రముఖ మౌలిక వసతుల సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ తమ ఊఖీ నిధుల కింద రూ. 4 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మిగిలిన నిధులను జిల్లా యంత్రాంగం సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేసింది.ఈ భవనంలో ఒకేసారి 400 మందికి పైగా పనిచేసుకునేలా ప్లగ్ అండ్ ప్లే వర్కింగ్ స్పేస్ వసతిని కల్పించారు. సరికొత్త బిజినెస్ ఐడియాతో వచ్చే యువతకు హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రొటోటైపింగ్ ల్యాబ్‌లు, లీగల్, ఫైనాన్షియల్ సలహాలతో పాటు ఫండింగ్ సమకూర్చే గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులను కూడా ఇక్కడికి అనుసంధానించనున్నారు. కడపను ఐటీ, ఆవిష్కరణల నిలయంగా మార్చే దిశగా ఈ భవన ప్రారంభోత్సవం సరికొత్త మైలురాయిగా నిలవనుందని స్థానిక పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.జగన్ ఎప్పుడూ కడపకు ఐటీ గురించి ఆలోచించలేదు.. ఫిష్ మార్టుల గురించి మాత్రమే గొప్పగా చెప్పేవారు. అందుకే కనీసం క్రెడిట్ తీసుకునేందుకు ఒక్క శాతం కూడా చాయిస్ లేకుండా పోయింది.

# అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...

విజయవాడ ఆగస్టు 28, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ క్రక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగు తోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధ మవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.

# వైఎస్‌ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు

విశాఖపట్టణం, ఆగస్టు 28, ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి.విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు.ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరఫున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశార్థకమే.ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.

# బొత్స పార్టీకి గుడ్ బై చెబుతున్నారా...

విజయనగరం, ఆగస్టు 28, బొత్స సత్యనారాయణ వైసీపీని వీడతారన్న చర్చ జోరుగా సాగుతుంది. బొత్స సత్యనారాయణ జనసేనలో చేరనున్నట్లు కూడా చెబుతున్నారు. బొత్స సత్యనారాయణ గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న కారణంగా ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. మరొకవైపు కుటుంబ సభ్యుల రాజకీయాల అవసరం కోసం కూడా బొత్స సత్యనారాయణ పార్టీ మారే అవకాశముందని అంటున్నారు. గత కొన్ని రోజులుగా బొత్స సత్యనారాయణ జనసేనలో చేరతారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆయన ఎటువంటి ఖండనలు చేయకపోవడం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లయింది. అయితే బొత్స సత్యనారాయణ పార్టీ మారడానికి గల కారణాలు కూడా కొందరు విశ్లేషిస్తున్నారు. ? బొత్స సత్యనారాయణ వైసీపీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారన్నది ప్రచారం. అయితే వైసీపీ 2019 లో అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి కాలం మంత్రిగా జగన్ కేబినెట్ లో ఉన్నారు. మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఆయన శాఖ మారింది కాని, కేబినెట్ నుంచి జగన్ తప్పించలేదు. విజయనగరం జిల్లాలో బలమైన నేత కావడం, సామాజికవర్గం, ఉత్తరాంధ్రలో సీనియర్ నేత కావడంతో బొత్స సత్యనారాయణ ను కంటిన్యూ చేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తర్వాత కూడా బొత్స కు వైసీపీ నుంచి అన్యాయం జరగలేదు. ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయితే అందులో పోటీకి బొత్స సత్యనారాయణకు అవకాశమిచ్చారు. ఎమ్మెల్సీగా గెలిచిన బొత్సకు శాసనమండలిలో శాసనసభ పక్ష నేత గా నియమించారు. దీంతో బొత్స అసంతృప్తికి గల కారణాలేంటి? అన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. . బొత్స సత్యనారాయణ జనసేనలో చేరబోతున్నారనే దానిపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రచారం జరుగుతోంది.విజయనగరం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబం జనసేనలోకి మారుతుందన్న చర్చ నడుస్తోంది, వైసీపీలో భవిష్యత్తు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె డాక్టర్ అనూష రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం.మెగా కుటుంబంతో ఉన్న సత్సంబంధాల కారణంగా వారు జనసేన వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.అయితే, దీనిపై బొత్స కుటుంబం లేదా జనసేన పార్టీ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కానీ జనసేనలో చేరినా వైసీపీ తరహాలోనే ఇదేరకమైన పదవులను ఆయన సాధించగలరు. అంతకు మించి సాధించిందేమీ ఉండదు. ఇప్పటికే బొత్స సత్యనారాయణ తన కుమార్తె స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా పోటీ చేస్తారని ప్రకటించారు. వైసీపీ నాయకత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రచారానికి తెరదించాలంటే సత్తిబాబు నోరు విప్పాల్సిందే.

# పాపం... మోపీదేవి...

గుంటూరు, ఆగస్టు 28, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి రెండిటికీ చెడ్డ రేవడిగా మారింది. ఇటు పార్టీ మారినా ప్రయోజనం లేదు. ఏ పదవి లేకుండానే ఏళ్లు గడచిపోతున్నాయి. రాజ్యసభ పదవిని వదులుకుని మరీ వైసీపీ నుంచి బయటకు వచ్చిన మోపిదేవి వెంకటరమణ తన రాజకీయం పతనాన్ని తానే కొనితెచ్చుకున్నట్లయింది. గత కొన్నేళ్ల నుంచి మోపిదేవి గురించి ఊసే వినిపించడం లేదు. రాజ్యసభ సభ్యుడిగా ఉండాల్సిన మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేసినా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నా ఆయనకు అవకాశం దక్కడం లేదు. రానున్న కాలంలో పదవి దక్కుతుందన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. ఎందుకంటే టీడీపీలోనే అనేక మంది పదవుల కోసం ఆశావహులు సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. దీంతో మోపిదేవి వెంకటరమణ కు ఈ టర్మ్ లో పదవి దక్కే అవకాశం లేదన్నది వాస్తవం. అయితే ఆయన ఇటీవల కాలంలో పూర్తిగా మౌనంగా ఉంటున్నారు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఓటమి పాలయినా జగన్ తన కేబినెట్ లో చోట కల్పించారు. ఎమ్మెల్సీని చేసి మరీ మోపిదేవి వెంకటరమణ ను మంత్రివర్గంలో స్థానం కల్పించారు. తర్వాత శాసనమండలి రద్దు ప్రతిపాదన చేయడంతో మంత్రి పదవి నుంచి తప్పించి మోపిదేవిని రాజ్యసభకు పంపారు. అయితే 2024 లో వైసీపీ ఓటమి తర్వాత ఎవరూ ఊహించని విధంగా మోపిదేవి వెంకటరమణ వైసీపీని వీడటం చర్చనీయాంశమైంది. ఇంకా పదవీ కాలం ఉన్నప్పటికీ తన పదవిని వదులుకున్న మోపిదేవి వెంకటరమణకు టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి పదవి ఇవ్వలేదు. ఇక నియోజకవర్గంలోనూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉండటంతో అక్కడ మోపిదేవి సాధారణ కార్యకర్తగానే మారిపోయి ఉండాల్సి వచ్చింది. అసలు పార్టీ ఎందుకు మారారు? ఏం సాధించారు? అన్న ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం మాత్రం లేదు.ఇప్పటి వరకూ చాలా ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయినా అందులో మోపిదేవి పేరు కనిపించలేదు. మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది? అని ఆయన అనుచరులే ప్రశ్నిస్తున్నారు. అనేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో మోపిదేవి వెంకటరమణ లాంటి సీనియర్ నేతలు పార్టీలు మారడం వల్ల రెండు వైపులా భిన్నమైన చర్చలు జరుగుతుంటాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మోపిదేవి వెంకటరమణ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన సందర్భంలో, కొందరు ఆయన నిర్ణయాన్ని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. .ఈ రాజకీయ పరిణామాలు లేదా మోపిదేవి వెంకటరమణ గారి ప్రస్తుత రాజకీయ పాత్ర ఎలాంటి స్పష్టత లేదు. ప్రస్తుతం ఏ పదవి లేకుండా మోపిదేవి వెంకటరమణ విశ్రాంతి తీసుకోవడం తప్ప ఆయన చేసిందేమీ ఉండదన్న వ్యాఖ్యలు కొంత ఘాటుగానే వినిపిస్తున్నా అందులో మాత్రం నిజం ఉందంటున్నారు.

# తగ్గేదెలా... అంటున్న కడప రెడ్డమ్మ

కడప, ఆగస్టు 28, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కడపలో తనకు వైసీపీ పోటీయే కాదని ఆమె చేసిన వ్యాఖ్యలు అతివిశ్వాసమా? మరేదైనా కారణమా? అన్న చర్చ జరుగుతుంది. ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కడప నియోజకవర్గంలో తనకు వైసీపీ పోటీయే కాదని, తనను ఓడించే సత్తా ఆ పార్టీకి లేదని చెప్పడాన్ని పలువురు అతి విశ్వాసంగానే చూస్తున్నారు. ఎందుకంటే మహామహులే ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జాతకాలు తిరగబడ్డాయి. అందులో తొలిసారి ఎన్నికయిన మాధవిరెడ్డి ఎంత? అని సోషల్ మీడియాలో కామెంట్స్ వినపడుతున్నాయి. వైసీపీ తనకు పోటీ యే కాదని చెప్పడం గర్వం తలకెక్కిందనడానికి కారణమని, అంతగా రెచ్చిపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వైసీపీ సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు. అయితే కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి దూకుడుగా మరియు ఆత్మవిశ్వాసంతోఉండటానికి ప్రధానంగా రాజకీయ నేపథ్యం, చారిత్రక విజయం మరియు కుటుంబ నేపథ్యం కారణాలుగా ఉన్నాయి.రెండు దశాబ్దాల తర్వాత కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన మొదటి మహిళా ఎమ్మెల్యే ఆమె. ఆమె మామ రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ఐదు సార్లు మంత్రిగా పనిచేసిన ప్రభావశీలమైన రాజకీయ కుటుంబం నుండి రావడంతో పాటు కుటుంబ వ్యాపారాల ద్వారా కన్‌స్ట్రక్షన్ రంగంలో అనుభవం కలిగి ఉండటం, నాయకత్వ లక్షణాలు ఉండటం. కూటమి ప్రభుత్వంలో కడప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పవర్‌ఫుల్ స్పీచ్‌లు ఇస్తూ దూకుడు ప్రదర్శించడం వంటివి తనకు అనుకూలమని మాధవి రెడ్డి భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాధవి రెడ్డి అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. లేదు.. లేదు. కొని తెచ్చుకున్నారు. టీడీపీకి, తన గెలుపునకు కృషి చేసిన వారిని కాదని వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ద్వితీయ శ్రేణి నేతలను చేరదీశారు. వారికి పదవులు ఇప్పించడానికి సిద్ధమయ్యారు. కొందరికి పదవులు కూడా కట్టబెట్టారు. అందుకే కడప నియోజకవర్గంలోని టీడీపీ పార్టీ క్యాడర్ లోనే ఆమెపై అసంతృప్తి ఉంది. కొందరు బహిరంగంగానే బయటపడ్డారు. మరికొందరు మరో టీడీపీ నేత పుత్తా వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇలా సొంత పార్టీనే సరిదిద్దుకోలేని కడప రెడ్డమ్మ ఇలా అతి గా చేసే వ్యాఖ్యలు ఆమె విజయానికి ఎంత మాత్రం దోహదపడవన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఎంత ఎదిగినా ఓవర్ యాక్షన్ చేయకుండా ఉండాలని, అలా చేస్తే ప్రజలు కూడా సరైన సమయంలో బుద్ధి చెబుతారని సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

## ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు బాధ్యతల స్వీకరణ

జనసేన పార్టీ శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా శుక్రవారం అధికారిక బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాగబాబు తన సతీమణి పద్మజ తో కలిసి పాల్గొన్నారు. వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు నాగబాబు కి వేద ఆశీర్వచనం అందించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏపీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నాగబాబు కి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా ఆయనకు ప్రభుత్వం కేబినెట్ ర్యాంకు హోదా కల్పించింది. ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు ని పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ చీఫ్ రాహుల్ పాండే, అటవీశాఖ సలహాదారు శ్రీ మల్లికార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ శ్రీ ఎన్. నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు శ్రీ వై. శ్రీనివాసరెడ్డి, పీసీసీఎఫ్ విజిలెన్స్ శ్రీమతి రేవతి, సీసీఎఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏపీ గ్రీన్ బి.ఎన్.ఎన్. మూర్తి , పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ వెంకటకృష్ణ, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, ఏపీఎంఎస్‌ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, తూర్పుకాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పాలవలస యశస్వి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పంచకర్ల సందీప్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# హాస్టల్ నుంచి విద్యార్థి అదృశ్యం..

# ఆందోళనలో తల్లిదండ్రులు




వికారాబాద్ తాండూరు పట్టణ సమీపం లోని ఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ & జూనియర్ కాలేజీ హాస్టల్ నుంచి 10వ తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. ఆ విద్యార్థి ఆచూకీ కోసం హాస్టల్ పీడీ తాండూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో హాస్టల్ లో ఉండి పదవ తరగతి విద్యార్థి అక్షిత్ చదువుకుంటున్నాడు.

ఉదయం సమయంలో హాస్టల్ నుంచి విద్యార్థి బయటకు వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

ఇదిలా ఉండగా, ఇదే హాస్టల్ ఇటీవల మరో వివాదంతో వార్తల్లో నిలిచింది. సీనియర్ విద్యార్థి, జూనియర్ విద్యార్థిపై దాడి చేసి, చపాతీ చేయలేదనే కారణంతో వాతలు పెట్టిన ఘటన ఇటీవల ఇదే నెలలో కలకలం రేపింది. తాజాగా మరో విద్యార్థి హాస్టల్ నుంచి వెళ్లిపోవడంతో హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మరోవైపు హాస్టల్కు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల భద్రతాపరమైన లోపాలు ఉన్నాయని పీడీ మీడియాతో పేర్కొన్నారు . విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# బీజేపీవైపు మూడ్ ఆఫ్ ది నేషన్...

హైదరాబాద్, ఆగస్టు 28, వాస్తవానికి ఇప్పట్లో కేంద్రస్థాయిలో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎందుకంటే సంకీర్ణ ప్రభుత్వం అయినప్పటికీ.. భాగస్వామ్య పార్టీలతో ఎటువంటి లుకలుకలు లేకుండా చూసుకుంటున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. టిడిపి తో.. అటు నితీష్ కుమార్ పార్టీతో.. ఏకకాలంలో ఉభయ కుశలోపరి అనే పాత్రను నరేంద్ర మోడీ పోషిస్తున్నారు.ఇటీవల కాలంలో నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ పురుడు పోసుకుంది. ఏకంగా జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇవి కాస్త సంచలనంగా మారాయి. ఒకరకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. అంతేకాదు జెన్ జెడ్ ను సంతృప్తి పరచడానికి నరేంద్ర మోడీ ఏకంగా ఇన్ స్టా గ్రామ్ లో వీడియోలు చేయాల్సి వస్తోంది. ఈ పరిణామాలు కేంద్రంలో బిజెపి స్థాయిని తగ్గిస్తున్నాయా.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందా. కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం సృష్టిస్తుందా.. ఇలా అనేక అంశాల ఆధారంగా మూడ్ ఆఫ్ దినేషన్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆసక్తికరమైన ఫలితాలు వెల్లడయ్యాయి.ఇప్పటికిప్పుడు దేశవ్యాప్తంగా ఎన్నికల జరిగితే బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి ఏకంగా 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని తెలుస్తోంది. మరోవైపు ఇండియా కూటమికి 185 సీట్లు లభిస్తాయని సమాచారం. ధరల స్థాయి పెరగడం.. నిరుద్యోగం.. ఇంకా అనేక సమస్యలు దేశంలో ఉన్నాయి. అయినప్పటికీ జెన్ జెడ్.. మిగతా వర్గాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయి. ఆయన ఆధ్వర్యంలోనే దేశం బలోపేతం అవుతుందని భావిస్తున్నాయి.ఈ సర్వేలో అనేక ప్రశ్నలను సంధించారు. ప్రధానంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి 67 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యవస్థ మీద నమ్మకం లేదని కుండబద్దలు కొట్టారు. మిగతా 14 శాతం మంది పరీక్షలు నిష్పక్షపాతంగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని 17 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎన్నికలలో రిగ్గింగ్.. అవినీతిని అరికట్టే విషయంలో కేంద్రం విఫలమవుతుందని మెజారిటీ యువత అభిప్రాయపడ్డారు. గతంలో ఈ సంఖ్య కొంత మాత్రమే ఉండగా.. ఇప్పుడు చాలామంది యువత జవాబుదారితనాన్ని కోరుకుంటుండడం విశేషం. మరోవైపు ఇటీవల నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మీద ఆందోళనలు నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఓటు వేస్తారని ప్రశ్నిస్తే.. చాలామంది వేయబోమని చెప్పారు. అది కేవలం ప్రశ్నించే గొంతు లాగా మాత్రమే ఉండాలని స్పష్టం చేశా

# కమలం పార్టీకి పొలిటికల్ స్పేస్

హైదరాబాద్, ఆగస్టు 28, తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బిఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండటంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది .మీరు కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, కాంగ్రెస్ మార్పు పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోదీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపం.. స్పష్టమైన సీఎం ఫేస్ లేదా తిరుగులేని ఒకరిద్దరు బలమైన నాయకులు లేకపోవడం . గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందూత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత జి. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు.పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అక్కడ కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది. కానీ తెలంగాణలో ప్రెస్ మీట్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరఫున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరువయ్యాయి. బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం.. బీఆర్ఎస్ – బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది.తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చు

# నేపాల్‌లో జల ప్రళయం..

# 547కి చేరిన మృతుల సంఖ్య

**నేపాల్‌లో ఆకస్మిక వరదలు**

**వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు**

**భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం**

**హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం**

**నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం**

నేపాల్–టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.

రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కష్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.

ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది.

ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదేకోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదంకూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.

ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## అనుబంధాల బంధం... రాఖీ

## ఘనంగా రాఖీ వేడుకలు.

కమాన్ పూర్‌అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ కమాన్ పూర్ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపి కుంట నాగారం పెంచికలపేట సిద్దిపల్లి తదితర గ్రామాల్లో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దూరప్రాంతాల నుండి వచ్చి ఆయా గ్రామాల్లోని తమ సోదరులకు రాఖీలు కట్టారు. దీంతో సోదరులు తమ చెల్లెలకు అక్కలకు దక్షిణ సమర్పించారు. దీంతోపాటు గ్రామాల్లో రాఖీ పండుగ సందడి నెలకొంది. అలాగే తమ తమ బంధువుల సోదరుల గ్రామానికి వెళ్లేందుకు బస్సులు కిటకిటలాడాయి. ఈ వేడుకల్లో తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీ ఓ ప్రియాంక, ఎంపీ ఓ సౌమ్య, గిదవార్ ప్రవంతి, సర్పంచులు పల్లె మాధవి నారాయణ, బంగారు కళ్యాణి మహేష్, పోల్ దాసరి వనిత సాయికుమార్, తదితరులు తమ సోదరులకు రాఖీలు కట్టారు.

# బొగ్గు నుంచి 'క్రిటికల్ మినరల్స్' దిశగా...

మంచిర్యాల, ఆగస్టు 28, బొగ్గే బంగారం అన్నది సింగరేణి నినాదం... విధానం. ఇప్పుడు బొగ్గును బంగారంగా చూడటం కాదు.. నిజమైన బంగార గనుల తవ్వకాన్ని చేపట్టబోతోంది. తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ తమ అధీనంలో ఉన్న దేవదుర్గ గోల్డ్ కాపర్ బ్లాక్‌లో బంగారు తవ్వకాలు చేపట్టనుంది. ఇకపై బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, రాగి వంటి కీలక ఖనిజాల అన్వేషణనూ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

తెలంగాణ డిప్యూటీ, మైనింగ్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఇవాళ దేవదుర్గ గోల్డ్ బ్లాక్‌ను సందర్శించనున్నారు. సింగేణి ప్రాజెక్టు పురోగతిపై బుధవారం సమీక్ష నిర్వహించిన భట్టి గోల్డ్ మైనింగ్ పై ఫోకస్ పెట్టారు. అందుకే ఆయన దేవదుర్గ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించబోతున్నారు. దేవదుర్గ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సహకారాల కోసం కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని భట్టి అధికారులకు సూచించారు.సింగరేణికి బొగ్గు గనుల నిర్వహణలో దశాబ్దాల అనుభవం ఉంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ తన కార్యకలాపాలను విస్తరించడంపై ఇప్పుడు దృష్టి పెట్టింది. ప్రస్తుతం కర్ణాటకలో తమ అధీనంలో దేవదుర్గ బ్లాక్‌లో రాగి బంగారు అన్వేషణ మాత్రమే కాకుండా.. గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల అన్వేషణలోనూ అవకాశాలను వెతకాలని సింగరేణి నిర్ణయించింది. రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రిన్యూవబుల్ ఎనర్జీ రంగాల్లో క్రిటికల్ మినరల్స్‌కు ప్రాధాన్యం ఉండబోతోంది. ఇప్పటి వరకూ బొగ్గుగే పరిమితం అయిన సింగరేణి కొత్తరంగాలకు విస్తరించగలిగితే.. సంస్థకు కొత్త ఆదాయ మార్గాలు కూడా ఓపెన్ అవుతాయి. కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణకు సింగరేణి ఇప్పటికే అడుగు పెట్టింది. 2025లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎస్‌సీసీఎల్ ఈ బ్లాక్‌కు ఎ–1 బిడ్డర్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్టును సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగం పర్యవేక్షణలో ముందుకు తీసుకెళ్లనుంది. ఈ గనిలో తవ్వకాలు ఎంత వరకూ లాభదాయకం, అక్కడ నిక్షేపాల పరిమాణం, నాణ్యత, జియోగ్రాఫికల్ పరిస్థితులు వంటి అంశాలపై ముందుగా అధ్యయనం చేస్తారు. ఒకప్పుడు 'బ్లాక్ గోల్డ్'గా పిలిచే బొగ్గుతో గుర్తింపు పొందిన సింగరేణి... ఇప్పుడు నిజమైన 'గోల్డ్'నే వెలికితీయబోతోంది. ఇది కనుక సక్సెస్ అయితే తెలంగాణ పాలిట ఇదొక గోల్డ్‌మైనే..! దేవదుర్గలో భట్టి విక్రమార్క పర్యటనతో ఈ ప్రాజెక్టుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అసలు అక్కడ ఎంత బంగారం ఉంది? ఎంత రాగి ఉంది? అన్వేషణ తర్వాత వాణిజ్యపరంగా తవ్వకాలు సాధ్యమవుతాయా? ? ఈ ప్రశ్నలకు రాబోయే అధ్యయనాలే సమాధానం చెప్పనున్నాయి

## రోడెక్కిన పాలిటెక్నిక్ విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 28, తెలంగాణలోని పాలిటెక్నిక్ కాలేజీలను కొత్తగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన శక్తి శాఖ పరిధిలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 పై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తరగతులను బహిష్కరించి వీధుల్లోకి వస్తున్నారు. ఈ ప్రతిపాదిత విలీనం వల్ల దశాబ్దాలుగా నడుస్తున్న సాంకేతిక విద్యా వ్యవస్థ దెబ్బతింటుందని, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు లభించే ప్రయోజనాలు తుడిచిపెట్టుకుపోతాయని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.విలీన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్ జీవో 97ను తక్షణమే రద్దు చేయడమే. పాలిటెక్నిక్ కోర్సులను స్కిల్ యూనివర్సిటీ కిందకు తీసుకువస్తే, ఈసీఈటీ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే లేటరల్ ఎంట్రీ' అవకాశాన్ని కోల్పోతామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కేవలం వృత్తి నైపుణ్య శిక్షణకే పరిమితం చేస్తే తమ ఉన్నత విద్య కలలు కల్లలవుతాయని, పాలిటెక్నిక్ విద్యా మండలి స్వయంప్రతిపత్తితో పాటు ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు కూడా ప్రమాదంలో పడతాయని నిరసనకారులు వాపోతున్నారు.ఈ విద్యార్థుల ఆందోళనలకు ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. బీఆర్ఎస్వీ , విద్యార్థి పరిషత్ నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ పోరాటాన్ని హోరాహోరీగా మార్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో బంతిలా ఆడుకుంటోందని, కార్పొరేట్ రంగానికి లబ్ధి చేకూర్చేందుకే పాలిటెక్నిక్ వ్యవస్థను ఉనికి లేకుండా చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపి అగ్రనేతలు మండిపడుతున్నారు.

# మాట్లాడితే వివాదం.. మౌనం పాటిస్తే వ్యూహం.


వరంగల్, ఆగస్టు 28, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, సొంత శాఖలోనూ తీవ్రమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మంత్రి కొండా సురేఖ ప్రస్తుతం పూర్తిస్థాయి మౌనం పాటిస్తున్నారు. బెంగళూరు వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన వైఖరిని, ఎదురవుతున్న పరిణామాలను పూసగుచ్చినట్లు వివరించి వచ్చిన తర్వాత ఆమె వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. ఇకపై మీడియాతో మాట్లాడేది లేదని తెగేసి చెప్పడం, క్రమశిక్షణా కమిటీ అధిష్టానానికి నివేదిక సమర్పించిన తర్వాత కూడా ఎటువంటి బహిరంగ వ్యాఖ్యలు చేయకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే దాగి ఉందనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో నడుస్తోంది.తన శాఖలోని అధికారులను తనకు తెలీకుండానే మాతృశాఖలకు పంపడం, ఓఎస్డీ సెటిల్మెంట్ల వ్యవహారంలో చట్టపరమైన విచారణలు వేగవంతం కావడం వంటి అంశాలపై సురేఖ తన అసంతృప్తిని ఇప్పటికే హైకమాండ్ ముందు ఉంచారు. అధిష్టానానికి పరిస్థితిని వివరించిన తర్వాత, తన బాధ్యత ముగిసిందన్నట్లుగా ఓ రోజు సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించిన ఆమె.. ఇప్పుడు వెయిట్ అండ్ సీ ధోరణిని అవలంబిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? తనను కేబినెట్ నుంచి తప్పిస్తుందా లేక నష్ట నివారణ చర్యలు చేపడుతుందా అనే అంశం ఆధారంగానే సురేఖ దంపతులు తమ తదుపరి అడుగులు వేయనున్నారు. కొండా సురేఖ ప్రస్తుత సైలెన్స్ కేవలం నిశ్శబ్దం కాదు, అధిష్టానం నిర్ణయం ఆధారంగా రాజకీయ దారి మార్చుకోవడానికి వేస్తున్న ముందస్తు ప్రణాళికగా అనుకోవచ్చు. ఒకవేళ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలకే మొగ్గు చూపి, ఆమెతో బలవంతంగా మంత్రి పదవికి రాజీనామా చేయిస్తే పరిస్థితి ఏంటి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గత చరిత్రను పరిశీలిస్తే కొండా సురేఖ దంపతులు ఏ పార్టీలో ఉన్నా తమ స్వయంప్రతిపత్తిని, ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు సిద్ధపడలేదు. కేవలం మంత్రి పదవి ఊడిపోవడమే కాకుండా పార్టీలో ప్రాధాన్యత తగ్గితే.. ఆమె కేవలం కాంగ్రెస్‌లోనే ఉండిపోతారా లేక ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి తమ సొంత నియోజకవర్గం వరంగల్ తూర్పులో సవాలు విసురుతారా అనేది కీలక ప్రశ్న.మంత్రి పదవిని కోల్పోతే ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేసి బై-ఎలక్షన్ కు వెళ్లే సాహసం కొండా మురళి, సురేఖ దంపతులు చేయవచ్చనే టాక్ వరంగల్ రాజకీయాల్లో గట్టిగా వినిపిస్తోంది. తమకున్న బలమైన బిసి కేడర్, వ్యక్తిగత ఇమేజ్‌ను నమ్ముకుని ఉపఎన్నికకు వెళ్లడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి , కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి రాజకీయ సవాలు విసిరే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ తమపై కఠిన చర్యలు తీసుకుంటే, బిసి సెంటిమెంట్‌ను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ ఉపఎన్నిక మార్గాన్ని ఎంచుకోవచ్చు. తెలంగాణలో బలపడేందుకు చూస్తున్న భారతీయ జనతా పార్టీ.. ఉత్తర తెలంగాణలో, ముఖ్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో సామాజిక సమీకరణాల దృష్ట్యా బలమైన బిసి నాయకత్వం కోసం వెతుకుతోంది. కొండా సురేఖ దంపతులకు బీజేపీ నుంచి ఆఫర్లు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకవేళ కాంగ్రెస్ నుంచి వైదొలిగితే బిజెపి తీర్థం పుచ్చుకుని, ఆ పార్టీ అభ్యర్థిగా సార్వత్రిక లేదా ఉపఎన్నికల బరిలోకి దిగడం సురేఖ దంపతులకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. కొండా సురేఖ మౌనం అనేది తుఫానుకు ముందు ఉండే నిశ్శబ్దం లాంటిది. అధిష్టానం ఇచ్చే ఫైనల్ రిపోర్టు లేదా తీసుకునే నిర్ణయమే తెలంగాణ కాంగ్రెస్‌లో మరో రాజకీయ ఆధిపత్య రగడకు దారితీస్తుందా లేదా అనేది తేల్చనుంది.

కొండా దంపతుల తదుపరి అడుగు కాంగ్రెస్ పార్టీకి వరంగల్ రీజియన్‌లో మునుపటి కంటే పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.

# ఫ్యూచర్‌సిటీ రియల్ ఎస్టేట్ జోరు

హైదరాబాద్, ఆగస్టు 28, భారత్ ఫ్యూచర్‌సిటీలో రియల్ ఎస్టేట్ భూం నడుస్తోంది. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన 121 చదరపు గజాల ప్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. గతంలో సుమారు రూ.5 లక్షలకు అమ్ముడైన ప్లాట్లు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతున్నాయి. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం ప్రారంభం, పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల పెరుగుదలతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట-ముచ్చర్ల గ్రామాల మధ్యలో దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. దీంతో ఆ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీలో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన లే-అవుట్లు, స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చిన 6 వేల మంది రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్లను కేటాయించింది. నిర్వాహిసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారంతో పాటు 121 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లు ఇచ్చింది.మీర్‌ఖాన్‌పేట్, పంజాగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో నివసిస్తున్న రైతుల నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు దశల్లో భూములను తీసుకుంది. ఆయా గ్రామాల ప్రజలకు పంజాగూడ రెవెన్యూ పరిధిలో లేఅవుట్లు డెవలప్ చేసింది. దాదాపు 6 వేల మంది రైతులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించింది. రైతుల పిల్లలు చదువుకునేందుకు వీలుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల స్కూల్ సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే అక్కడి లే-అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు కొందరు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం, ప్లాట్ అమ్మితే వచ్చే డబ్బుతో హైదరాబాద్ దగ్గర్లో భూములు కొనాలని నిర్ణయించారు. ఒకరిద్దరు రైతులు ఏడాది క్రితం విక్రయించగా.. 121 చదరపు గజాల ప్లాటు రూ.5 లక్షలకు అమ్ముడయ్యింది.తాజాగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం రెండు నెలల క్రితం ప్రారంభమవగానే.. ప్లాట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో నిన్న మె?న్నటి వరకు చదరపు గజం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ధర పలకగా.. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్ల ధర అనూహ్యంగా పెరిగింది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఒక్కో ప్లాటు అమ్ముడవుతోంది. అంటే దాదాపు 10 వేల నుంచి రూ.23 వేల వరకు గజం పలుకుతోంది. జులైలో ఒక రైతు తన ప్లాటును రూ.28 లక్షలకు విక్రయించారు. ఆ ప్లాట్లను కొంటే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు వేగంగా సమకూరుతాయన్న అంచనాతో కొందరు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు కొనే ఆర్థిక స్థోమత లేని వారు భవిష్యత్ పెట్టుబడిగా ఫ్యూచర్ సిటీలో స్థలాలు కొనేందుకు రెడీ అవుతున్నారు

# రాఖీ పండుగ పేరుతో ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో చార్జీల బాదుడు




హైదరాబాద్ ఆర్టీసీ స్పెషల్ బస్సులలో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతున్నాయి. పండుగల పేరుతో ఇష్టానుసారంగా చార్జీలు పెంచుతున్నారు.

హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు నార్మల్ ఛార్జ్ 290. పండుగ పేరుతో 1:50 రూల్ పేరుతో అదనంగా 100 నుంచి 150 చార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు మెట్రో డిలక్స్ స్పెషల్ బస్ లో 400 వసూలు చేస్తారు. సూపర్ లగ్జరీ బస్సులు లో అదనపు చార్జీల బాదుడు కొనసాగింది. ప్రయాణికులు లబో దిబో అంటున్నారు. స్పెషల్ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కిన తర్వాత మార్గ మధ్యం లో ఎక్కువ చార్జీలు ఆర్టీసీ కండక్టర్ లు వసూలు చేస్తున్నారు. అధికారులు ఆర్టీసీ ఉద్యోగుల నిర్లక్ష్యంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

హైదరాబాద్ రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఆయన సోదరీమణులు రాణి, విమల రాఖీ కట్టి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అలాగే మంత్రి సోదరులు పొన్నం అశోక్ గౌడ్, పొన్నం రవిచంద్రలకు కూడా సోదరీమణులు రాఖీలు కట్టారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, పొన్నం అశోక్ గౌడ్, పొన్నం రవిచంద్రలు తమ అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదర , సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, ఆప్యాయతలకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వేటు ఖాయం...

హైదరాబాద్, ఆగస్టు 28, తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో కాంగ్రెస్ హైకమాండ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ వివాదానికి సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించిన అధిష్ఠానం, తుది నిర్ణయాన్ని తీసుకునేందుకు సిద్ధమవుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో సెప్టెంబరు రెండో తేదీ వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడకపోవచ్చు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో లేరు. ఆయన వచ్చిన తర్వాత మాత్రమే కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యల గురించి ఒక నిర్ణయానికి పార్టీ నాయకత్వం వచ్చే అవకాశముంది. క్రమశిక్షణ చర్యలు తీసుకోకుంటే పార్టీలో నేతలు మరింత గాడి తప్పుతారన్న భావన నెలకొంది. అయితే కేసీ వేణుగోపాల్ విదేశాల నుంచి ఢిల్లీ వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో సమావేశమై వారితో చర్చించిన అనంతరమే అధికారికంగా ఏ విషయాన్ని పార్టీ నాయకత్వం ప్రకటిస్తుందని కూడా సమాచారం అందుతుంది. అయితే ఎటువంటి చర్యలుంటాయి? కొండా సురేఖకు ప్రత్యామ్నాయంగా మరొక బీసీ నేత పేరును కూడా ఇప్పటికే ఇక్కడి నాయకత్వం సిద్ధమయినట్లు సమాచారం. హైకమాండ్ కోరితే వెంటనే రెండు నుంచి మూడు బీసీ నేతల పేర్లను నాయకత్వానికి ఇవ్వాలన్న యోచనలో ఉన్నారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించినప్పటికీ మరొక బీసీ నేతకు కేబినెట్ లో అవకాశం ఇవ్వడం ద్వారా బీసీల్లో వ్యతిరేకత రాకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశముంది. హైకమాండ్ ఆలోచనలివీ... 1. పదవికి రాజీనామా: కొండా సురేఖను గౌరవప్రదంగా తన మంత్రి పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని అధిష్ఠానం కోరే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2. మంత్రివర్గం నుండి బర్తరఫ్: ఒకవేళ ఆమె రాజీనామాకు నిరాకరిస్తే, మంత్రివర్గం నుంచి నేరుగా తొలగించే (బర్తరఫ్) అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. సస్పెన్షన్ లేదా క్రమశిక్షణా చర్యలు... పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండేందుకు ఆమెపై సస్పెన్షన్ లేదా తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు ఉండేలా తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి నివేదికను ఏఐసీసీకి పంపారు. ప్రత్యామ్నాయంపై కసరత్తుకొండా సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రి పదవి ఇవ్వాలని హైకమాండ్ భావిస్తోంది.ఇందులో భాగంగానే బీసీ సమీకరణాలు దెబ్బతిన కుండా ఎమ్మెల్సీ విజయశాంతి లేదా ఇతర మహిళా ఎమ్మెల్యేల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయంలో కొండా సురేఖపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ మొదటి వారంలో కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల తో రాష్ట్ర నేతలు భేటీ అయి తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

కలకలం రేపుతున్న అనిరుధ్ రెడ్డి కామెంట్స్

కొండా సురేఖ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. మహిళలను తాను ఎంతో గౌరవిస్తానని పేర్కొ?న్న అనిరుధ్ రెడ్డి.. వారి గురించి బహిరంగంగా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడే ఉద్దేశం తనకు లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా మహిళల పట్ల తన వైఖరిని వివరిస్తూ అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మహిళలు తనను తిట్టినా వాటిని ఆశీర్వాదాలుగానే భావిస్తానని పేర్కొన్నారు. తన తల్లి తనను మందలించినా ఎదురు మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోతానని చెప్పారు.మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటే ఆ భావోద్వేగాన్ని తేలిగ్గా తీసుకోకూడదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక మహిళ కన్నీరు ఒక్క చుక్క నేలపై పడినా అది సునామీగా మారుతుంది.. ఆ సునామీలో మనమే కొట్టుకుపోతాం అని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించారని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు.

ఈ వ్యవహారం ప్రస్తుతం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉందని చెప్పారు. ఏఐసీసీ, పీసీసీ, ముఖ్యమంత్రి స్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఎవరు తప్పు చేశారనేది దేవుడికి తెలుసని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ నివేదిక ఎలా ఉన్నా దాన్ని గౌరవిస్తామని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు. పార్టీ అంతర్గత వ్యవహారంపై తాను మరింతగా స్పందించను అనే సంకేతాలు ఇచ్చారు.ఇదే సమయంలో తన నియోజకవర్గ సమస్యలపై మాత్రం వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తన నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడితే ఎవరినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అవసరమైతే మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతానని.. నిధులు రాకపోతే దీక్షకు కూడా కూర్చుంటానని వ్యాఖ్యానించారు.

'మహిళ కన్నీరు నేలపై పడితే సునామీనే'.. కొండా సురేఖ వివాదంపై అనిరుధ్ రెడ్డిప్రజల సమస్యల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో తప్పేమీ లేదని ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజలకు ప్రశ్నించే హక్కును కల్పించిందని.. తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారంపై సంయమనం పాటిస్తూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. మరోవైపు జడ్చర్ల అభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో వెనుకడుగు వేయబోనని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్ ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు పార్థివ దేహానికి మెగాస్టార్ చిరంజీవి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరిగిన అంత్యక్రియలకు హాజరైన చిరంజీవి , నారాయణరావు తో తనకున్న అనుబంధాన్ని, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఫిలిం ఇన్స్టిట్యూట్ రోజుల నుంచి మా ఇద్దరి పరిచయం. తను అప్పటికే ఇన్స్టిట్యూట్లో సీనియర్. మేము ట్రైనింగ్ అవుతున్నప్పుడు తను వచ్చి తన అనుభవాలను పంచుకునేవారు. అలా మాకు దగ్గరయ్యారు. ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం ఎదిగినప్పుడు, నాకు ఒక స్టార్ ఇమేజ్ వచ్చినప్పుడు "నేను నిర్మాతగా నిలబడాలనుకుంటున్నాను. నువ్వు సినిమాలు చేయాలని" అడిగారు. అలా ఆయన నిర్మాణంలో రెండు చిత్రాలు చేయడం జరిగింది. నా సినిమాల్లో తనకు నటుడిగా కూడా అవకాశాలు వచ్చేలా చేయడం జరిగింది. అలా మా అనుబంధం కొనసాగుతూ వచ్చింది. యాదృచ్ఛికంగా ఒక పది రోజుల క్రితం "నేను ఒక సినిమా చేశాను. మంచు పల్లకి ఇన్స్పిరేషన్తో ఐదుగురు కుర్రవాళ్లు.. పెద్దవాళ్లు అయితే ఎలా ఉంటారో అనే కథతో ఒక సినిమా చేశాను. ట్రైలర్ లాంచ్ చేయాలి. మీ సహకారం ఉంటే అందరికీ బాగుంటుంది" అని అన్నారు. కచ్చితంగా చేస్తానని చెప్పాను. ఆ క్షణంలో ఇద్దరం కలిసి ఒక ఫోటో దిగుదాం రమ్మని అడిగారు. బహుశా తన ఆఖరి చిత్రం అదేనేమో. ఆ సమయంలో చాలా సేపు మాట్లాడుకున్నాము. ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోవాలని చెప్పాను. ఆ క్షణంలో తనకి ఆల్ ది బెస్ట్ చెప్పాను. కానీ అదే మాట శాశ్వతంగా గుడ్బై అవుతుందని అనుకోలేదు. ఎక్కడున్నా సరే నారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు కూడా నా కుటుంబ సభ్యులే.. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

# రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ కి రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులు



రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరీమణులు ఎమ్మెల్యే శ్రీగణేష్ గారిని వారి నివాసంలో కలిసి రాఖీలు కట్టి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రక్షా బంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయ, అనుబంధానికి ప్రతీక అని అన్నారు. మహిళా సోదరీమణులు చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో సంతోషాన్ని కలిగించాయని తెలిపారు.మహిళల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# జెన్ జీ యువత ప్రామాణికతను, క్రియాశీల భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నారు

**యువతను తక్కువ అంచనా వేయొద్దు**

**రాజకీయ నాయకులు ఇగోను వీడి, నిర్ణయాల్లో జెన్ జీ ని భాగస్వామ్యం చేయాలి**

**రాజకీయాలు, పరిపాలనలో జెన్ జీ ని భాగస్వామ్యం చేయడంపై మంత్రి నారా లోకేష్**

ముంబై: సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగ స్వాములుగా చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రాజకీయ పార్టీలకు పిలుపు నిచ్చారు. నిన్న (ఆగస్టు 26) ముంబైలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40 అవార్డుల కార్యక్రమంలో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రాజకీయాలు, పాలనలో జెన్ జీ యువతను భాగస్వామ్యం చేయడం ప్రాముఖ్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. యువతరంతో తన అనుభవాన్ని పంచుకుంటూ , తాను నేర్చుకున్న అతి పెద్ద పాఠం చాలా సులభమైనదని అన్నారు. వారిని తక్కువ చేసి మాట్లాడవద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగం చేయాలని అన్నారు.జెన్ జీ, యువతతో తన అనుబంధం రాజకీయాలపై ప్రస్తుత ఉద్యమానికి చాలా ముందే ప్రారంభమైందని మంత్రి లోకేష్ అన్నారు. మా ముఖ్యమంత్రి గారు, ఒక మంత్రిగా నేను వారిని పలుమార్లు కలిశాము. మేము ఒక నియోజకవర్గానికి వెళ్ళినప్పుడు, అక్కడ ఉన్న ఇన్ఫ్లుయెన్సర్లందరినీ కలుస్తూ ఉంటాం. మేము ఇంకా బాగా ఎలా చేయగలమని మీరు అనుకుంటున్నారు? ఈ నియోజకవర్గంలో మనం భిన్నంగా ఏమి చేయగలమని మీరు భావిస్తున్నారు? అని వారిని అడుగుతామని తెలిపారు.ఇటువంటి సంభాషణల నుండి అద్భుతమైన ఆలోచనలు వస్తాయని, ముఖ్యంగా వారి సూచనలను అనుసరించడానికి తమవద్ద ఒక వ్యవస్థ ఉందని లోకేష్ తెలిపారు. మీకు ఎంతో అద్భుతమైన ఆలోచనలు వస్తాయి, వాటిని మేము ఫాలో-అప్ చేసే విధానం ఉంది. కాబట్టి వారిని సంభాషణలో భాగం చేయండి, అదే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని లోకేష్ అన్నారు.కొత్త తరం అంచనాలకు అనుగుణంగా రాజకీయ నాయకులు మారాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, రాజకీయ నాయకులు తమ ఇగోలను వీడి ప్రామా ణికతను అలవర్చుకోవడం చాలా ముఖ్యమని లోకేష్ అన్నారు. రాజకీయ నాయకులుగా మనం మన బ్యారియర్స్ ను వదిలేయడం ముఖ్యమని నేను భావిస్తున్నాను. ఈ రోజుల్లో యువత మీతో చాలా భావోద్వేగ స్థాయిలో కలవడానికి సిద్ధంగా ఉన్నారు, వారు మీ నుండి ప్రామాణికతను ఆశిస్తున్నారు" అని ఆయన అన్నారు. ప్రామాణికత, పారదర్శకత భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకులకు నిర్వచించే లక్షణాలుగా ఉంటాయని ఆయన అన్నారు. భారతదేశంలో తదుపరి తరం రాజకీయ నాయకుల నుండి వారు ఆశిస్తున్నది అదేనని నేను నమ్ముతున్నానని లోకేష్ పేర్కొన్నారు.

# ఏఐసీసీ ఆఫీసుకు చేరిన సురేఖ వివాదం

న్యూఢిల్లీ, ఆగస్టు 28, గాంధీభవన్ నుంచి బెంగళూరు వరకు.. తెలంగాణ కాంగ్రెస్‌లో సురేఖ ఎపిసోడ్ కాక రేపుతోంది. మంత్రి కొండా సురేఖపై క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం ఏఐసీసీదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఖర్గేతో భేటీ కావడం హాట్‌టాపిక్‌గా మారింది. తెలంగాణ టు ఢిల్లీ.. వయా బెంగళూరు.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసలేం జరుగుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కొండా సురేఖ కుటుంబం చేసిన వ్యాఖ్యలతో వివాదం మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డిపై వచ్చిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. సురేఖ వాటిని ఖండించలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో క్రమశిక్షణా కమిటీ రంగంలోకి దిగింది. సురేఖతో పాటు మరో సీనియర్ నేత జి.చిన్నారెడ్డిపై కూడా చర్యలకు సిఫారసు చేసిందని సమాచారం వస్తోంది. ఇక తుది నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోకి వెళ్లిందిఇక్కడే అసలు రాజకీయ చర్చ మొదలైంది. ఇది కేవలం వ్యక్తుల మధ్య వివాదమా లేక తెలంగాణ కాంగ్రెస్‌లో పవర్ బ్యాలెన్స్ మారుతోందా అనే వాదన వచ్చింది. ఉమ్మడి వరంగల్‌లోని పాత విభేదాలు కూడా ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. కొండా సురేఖ, కొండా మురళీకి.. అక్కడి కాంగ్రెస్ నేతలతో విభేదాలు కొత్త కాదు. గతంలోనూ కొండా మురళీ పార్టీ అంతర్గత అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఆ పాత విభేదాలకు కొత్త వివాదం తోడైందన్న చర్చ జరుగుతోంది.కొండా సురేఖ గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 2024లో కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సమంత, నాగచైతన్య అంశాన్ని ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తర్వాత సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారు. అయితే ఆ వివాదం రాజకీయ ప్రత్యర్థులపై విమర్శల వరకే పరిమితమైంది. ఇప్పుడు పరిస్థితి వేరు. ఈసారి వ్యవహారం నేరుగా పార్టీ, ప్రభుత్వం, సీఎం, పీసీసీ నాయకత్వం వరకు వెళ్లింది.కాంగ్రెస్‌లో విమర్శలు కొత్త కాదు. సీఎం, పీసీసీ చీఫ్‌లపై గతంలోనూ సొంత పార్టీ నేతలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. భిన్నాభిప్రాయాలు కూడా కాంగ్రెస్‌లో ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే ప్రతి వ్యాఖ్యకు చర్య ఉండదు. సందర్భం ఏంటి? పార్టీకి నష్టం ఎంత? వ్యాఖ్యలు ఎవరిపై? పార్టీ లైన్ దాటారా? అన్నదే కీలకం. సురేఖ విషయంలో గీత ఎక్కడ గీస్తారనే ఆసక్తికరంగా మారింది.తెలంగాణలో 2014 నుంచి 2023 వరకు కాంగ్రెస్ అధికారంలో లేదు. 2023లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చింది. కాబట్టి వివాదాస్పద వ్యాఖ్యలతో కాంగ్రెస్ మంత్రిని కేబినెట్ నుంచి తప్పించిన స్పష్టమైన పాత ఉదాహరణ తెలంగాణలో కనిపించదు.అందుకే సురేఖపై నిర్ణయం కీలకం.. చర్య తీసుకుంటే.. క్రమశిక్షణ విషయంలో పార్టీ కఠినంగా ఉందన్న సంకేతం వెళ్తుంది. చర్య తీసుకోకపోతే.. సిఫారసులపై వెనక్కి తగ్గారన్న విమర్శ రావచ్చు.సురేఖ వ్యవహారంలో బీసీ రాజకీయాలు కూడా తెరపైకి వచ్చాయి. తనపై చర్యల చర్చ సమయంలో బీసీ ప్రాతినిధ్యం అంశం ప్రాధాన్యం పొందింది. అయితే రెండు అంశాలను వేరు చేయాల్సిందే. బీసీ ప్రాతినిధ్యం ఒక రాజకీయ అంశం. పార్టీ క్రమశిక్షణ మరో అంశం. బీసీ కార్డు రాజకీయంగా బలం ఇవ్వొచ్చు. కానీ క్రమశిక్షణపై పార్టీ నిర్ణయం మాత్రం దాని ఆధారంగా మాత్రమే ఉండకపోవచ్చు. అదే సమయంలో సామాజిక సమీకరణాలను విస్మరించడం కూడా కాంగ్రెస్‌కు అంత సులభం కాదు.భట్టి విక్రమార్క.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో భేటీ కావడంతో చర్చ మరింత పెరిగింది. సురేఖ వ్యవహారంతో పాటు తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితులపై భట్టి వివరించారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఉమ్మడి వరంగల్ పరిస్థితులు.. ఎమ్మెల్యేలు, విప్‌ల అసంతృప్తి.. పార్టీ, ప్రభుత్వంపై ప్రభావం.. వంటి అంశాలు చర్చకు వచ్చాయంటున్నారు. అయితే భట్టి ఖర్గేతో ఏం మాట్లాడారన్నది అధికారికంగా వెల్లడికాలేదు. అందుకే ఇవన్నీ ప్రస్తుతం పార్టీ వర్గాల సమాచారం, రాజకీయ అంచనాలుగానే చూడాలి.ఇదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. సురేఖపై చర్య అనేది ఒక్క మంత్రి వ్యవహారంగా కనిపించినా.. దాని ప్రభావం చాలా దూరం వెళ్లొచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వైఖరి. మంత్రుల మధ్య సమన్వయం. వరంగల్ రాజకీయాలు. బీసీ సమీకరణాలు అన్నీ ఇందులో కలుస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం సురేఖ భవిష్యత్తుతో పాటు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.సురేఖపై కఠిన చర్య తీసుకుంటే పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని కాంగ్రెస్ చెప్పొచ్చు. కానీ వరంగల్‌లో అసంతృప్తి పెరగొచ్చు. బీసీ రాజకీయాలపైనా చర్చ పెరగొచ్చు. చర్య తీసుకోకపోతే పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫారసును ఎందుకు పక్కన పెట్టారన్న ప్రశ్న వస్తుంది. ఇతర నేతలకు కూడా తప్పుడు సంకేతం వెళ్తుందన్న విమర్శలు రావొచ్చుఇప్పుడు పంచాయితీ గాంధీభవన్ దాటి అధిష్ఠానం వరకు వెళ్లింది. ఖర్గే స్థాయిలో చర్చకు వచ్చింది. కేసీ వేణుగోపాల్ తిరిగి వచ్చిన తర్వాత తుది నిర్ణయం ఉండొచ్చన్న ప్రచారం కూడా ఉంది. మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? పార్టీ పరంగా మాత్రమే చర్య తీసుకుంటారా? లేక చివరకు సర్దుబాటు చేస్తారా అనే ఉత్కంఠకు తెరపడనుంది.ఈ క్రమంలోనే.. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కొండా సురేఖ ఫొటో లేకపోవడం ఇప్పుడు మరో సంచలనంగా మారింది. మొత్తంగా ఇది కొండా సురేఖ వర్సెస్ కాంగ్రెస్ అన్నంత సింపుల్ వ్యవహారం కాదు. పార్టీ క్రమశిక్షణ. ప్రభుత్వ ప్రతిష్ఠ. వరంగల్ రాజకీయాలు. బీసీ సమీకరణాలు. నాయకత్వ బలం అన్నీ ఇందులో ఉన్నాయి. సురేఖ ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ గాంధీభవన్‌లో పడుతుందా? బెంగళూరులో ఖర్గే నిర్ణయంతో పడుతుందా? లేక ఢిల్లీ నుంచి వచ్చే ఆదేశాల తర్వాతే పంచాయితీ ముగుస్తుందా అన్నది వేచి చూడాలి.

# మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



హైదరాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మంత్రి పొన్నం ప్రభాకర్ కి, వారి కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి సీతక్క రాఖీ కట్టి మంత్రి పొన్నం ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీలు కట్టిన సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పౌర్ణమి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

# ముఖ్యమంత్రి సభకు భారీ ఏర్పాట్లు పూర్తి

**నేడు అరకులోయలో చంద్రబాబు పర్యటన..**

**గన్నెలలో బహిరంగ సభ**

అరకులోయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం అరకులోయలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, పోలీసులు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. గన్నెల గ్రామ సమీపంలో ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకుసంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. గత మూడు రోజులుగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు, పోలీసులు సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.సభా ప్రాంగణం వద్ద ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, ప్రజలు, పార్టీ కార్యకర్తల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను సిద్ధం చేశారు.



బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా సమావేశంతో పాటు టీడీపీ కార్యకర్తల కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దొన్ను దొర సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి వివరాలను వెల్లడించారు. అరకు పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి తేజోవతి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ నిషాంతి, జాయింట్ కలెక్టర్ శ్రీ పూజ, ఐటీడీఏ పీవో వర్మ తదితర అధికారులు సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.కట్టుదిట్టమైన భద్రతముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సభా ప్రాంగణంతో పాటు ముఖ్యమంత్రి పర్యటించే మార్గాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అరకు లోయ పరిసర ప్రాంతాల్లో పారా మిలటరీ బలగాలను భారీగా మోహరించి భద్రతను పర్యవేక్షిస్తున్నారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం సుమారు 11 గంటలకు ఎలిఫ్యాడ్ వద్ద హెలికాప్టర్‌లో దిగనున్నట్లు సమాచారం. అక్కడి నుంచి ఆర్కే నగర్‌లోని ఏకలవ్య పాఠశాలను సందర్శించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం గన్నెల గ్రామంలో 'సంజీవిని' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.తదుపరి ఆర్కే నగర్‌లో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని స్థానిక ప్రజలతో మాట్లాడనున్నారు. అనంతరం గన్నెల గ్రామ సమీపంలోని సభా ప్రాంగణంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.బహిరంగ సభ అనంతరం టీడీపీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణం కానున్నారు.అరకు లోయలో రాజకీయ సందడి.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అరకులోయలో రాజకీయ సందడి నెలకొంది. భారీ సంఖ్యలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు సభకు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు, పార్టీనాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారు.పర్యటన సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

**కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై**

**పోరుబాటకు కేటీఆర్ పిలుపు**



హైదరాబాద్ అవినీతిని ఎండగట్టాలి పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపువారం రోజుల ప్రత్యేక నిరసన కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్,ఒకటవ తేదీన తెలంగాణ భవన్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్‌తో ప్రజల్లోకి బీఆర్ఎస్. రెండవ తేదీ నుంచి వరుసగా కార్యక్రమాలు.. సెప్టెంబర్ 2ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు420 హామీల మోసాన్ని గుర్తుచేస్తూ భారీ ఫ్లెక్సీల ప్రదర్శనప్రజలకు బాకీ ఉన్న హామీలతో ఇంటింటికీ బాకీ కార్డుల పంపిణీ:సెప్టెంబర్ 3వ్యవసాయ విధ్వంసంపై అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులుసాగునీరు, విద్యుత్, యూరియా, బీమా సమస్యలపై రైతులతో సమావేశాలుహైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై నిరసనలు, సెప్టెంబర్ 4మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులుమహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై నిరసన కార్యక్రమాలురూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అంశాలపై నిలదీతహామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పుసెప్టెంబర్ 5విద్యార్థులు, యువతతో నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు.. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై పోరాటంఆదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులుసెప్టెంబర్ 6హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీతాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని నిలదీతగ్రామాల్లో పారిశుద్ధ్యం, పల్లెల సమస్యలపై నిరసన కార్యక్రమాలుసెప్టెంబర్ 7ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు420 హామీల మోసంపై జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులుసెప్టెంబర్ 8వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లుఅంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులుసెప్టెంబర్ 10 ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావం. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అవినీతి ఆరోపణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి చేపట్టనున్న వారం రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి వరుసగా ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు.ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల ముందు ఎండగట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

# పేద మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 28 ;పేద మహిళ అంత్యక్రియలకు విశ్వంలో వీలీనం, వెస్సో ట్రస్ట్ ల సంయుక్త ఆద్వర్యం లో ఆర్థిక సహాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నాయి.

కాకినాడ జిల్లా తునికి చెందిన దంపతులు యండపల్లి తాతబ్బాయి(69), లక్ష్మీ(63) డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటారు. తాతబ్బాయి కఱ్ర పని చేసుకుని జీవించేవారు.భార్యాభర్తలు ఇరువురు ఒకేసారి జబ్బు పడ్డారు.

ఇరువురు కొడుకులు కష్టపడి తల్లిదండ్రులకు వైద్యం చేయించారు కానీ తండ్రి తాతబ్బాయి కోలుకోగా, తల్లి లక్ష్మీ మాత్రం అనారోగ్యం తో తుది శ్వాస విడిచారు. తల్లిదండ్రుల వైద్యానికి ఖర్చుపెట్టి ప్రస్తుతం ఎటువంటి ఆదా లేని పరిస్థితిలో లక్ష్మి కుమారులు తమ తల్లి గారి అంతిమ సంస్కారాలు పూర్తి చేయడానికి మద్దతు కోరగా విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ మరియు వెస్సో ట్రస్ట్ లు సంయుక్తంగా పదివేల రూపాయలు అందజేసినట్లు విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెంట శ్రీనివాస ఆచార్య తెలిపారు.

# బ్రాహ్మణులను అవమానించొద్దు

## చెప్పుడు మాటలు చేటు తెస్తాయి
## అది గమనించి మెదలు కోవాలి
## కవిత వ్యాఖ్యలను ఖండించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బి శ్రీనివాస్




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**
హైదరాబాద్ ఆగస్ట్ 28: చెప్పుడు మాటలు చేటు తెస్తాయని అది గమనించి మెదలు కోవాలని రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్ సూచించారు. గాంధీ భవన్లో వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ తో కలిసి ఆయన మీడియా తో మాట్లాడారు.బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ పదవి విషయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత చేసిన వ్యాఖ్యలు సరికావని ఆయన పేర్కొన్నారు వ్యక్తుల ప్రాంతీయతను ముందుకు తెచ్చి ఒక సామాజిక వర్గాన్ని విభజించే ప్రయత్నం చేయడం తగదన్నారు.

తనను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం వెనుక ఎలాంటి ప్రాంతీయ అంశం లేదని, బ్రాహ్మణ సమాజ సంక్షేమం కోసం పనిచేయాలన్న ఉద్దేశంతోనే బాధ్యతలు అప్పగించారని తెలిపారు. తాను చెప్పుడు మాటల ద్వారా కవిత ఆరోపించి నట్టుగా ఆంధ్ర ప్రాంత వ్యక్తిని కాదని పూర్వికులు ఖమ్మం ప్రాంతావాసులని తాను నల్గొండ జిల్లా నడిగూడెంలో జన్మించానని విద్యాబ్యాసం మొత్తం తెలంగాణ లోనే సాగిందని ఆయన వివరించారు.పదవులు ప్రాంతంతో పాటు వారి సామర్థ్యం, సేవా భావం, సమాజానికి చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని ఇస్తారని ఆ విషయం ఎంపీ, ఎమ్మెల్సీ గా చేసిన కెసిఆర్ బిడ్డ కవితకు తెలవక పోవడం విచారకరమన్నారు.తెలంగాణ ఉద్యమంలో బ్రాహ్మణ సమాజం కూడా తన వంతు పాత్ర పోషించిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణలోని బ్రాహ్మణుల సంక్షేమం, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.బ్రాహ్మణ సమాజాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని అన్నీ పార్టీల చెందిన బ్రాహ్మణ బంధువులు తన పదవి ప్రమాణ కార్యక్రమం లో పాల్గొన్నారని ఆ విషయం రక్షణ సేన లోని బ్రాహ్మణ వ్యక్తులను అడగాలని ఆయన కవిత కు సూచించారు. పార్టీలు వ్యక్తులను పరిషత్ పట్టించుకోదని అది అందరికి ఉపయోగ పడుతుందని తెలిపారు ప్రాంతం గురించి ప్రశ్నించడం కంటే, బ్రాహ్మణుల కోసం నేను ఏం చేస్తానన్నదే ముఖ్యం. కవిత చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతంగా నన్ను బాధించడమే కాకుండా, బ్రాహ్మణ సమాజాన్ని కూడా అవమానించేలా ఉన్నాయన్నారు తెలంగాణలో ఉన్న ప్రతి బ్రాహ్మణ కుటుంబం అభివృద్ధి కోసం పనిచేస్తానని ఎవరు ఎన్ని విమర్శలు చేసినా వెనక్కి తగ్గేది లేదని శ్రీనివాస్ స్పష్టం చేశారు.ప్రాంతీయత పేరుతో సమాజంలో చిచ్చు పెట్టడం కంటే తెలంగాణ అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. బ్రాహ్మణ పరిషత్‌ను రాజకీయ వేదికగా కాకుండా సంక్షేమ వేదికగా బలోపేతం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.ఏ పార్టీ చేయని విదంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నెత్రుత్వంలో బ్రాహ్మణ జాతి అభివృద్ధి కి తోడ్పాటు నిస్తున్నారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు తో పాటు వివిధ శాఖల్లో బ్రాహ్మణ అధికారులు కీలక శాఖల్లో ఉన్నారని బస్వరాజ్ శ్రీనివాస్ తెలిపారు

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం




హైద్రాబాద్ ఆగస్ట్ 28; అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగరశాఖ ఆధ్వర్యంలో, నగర కార్యదర్శి సురేందర్ నాయకత్వంలో రక్షాబంధన్ వేడుకలను పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి, వారి సేవలకు గౌరవం తెలిపారు.

సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. రక్షాబంధన్ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టడం ద్వారా వారికి ఆత్మీయతతో పాటు గౌరవాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు



కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగుల సోదరీమణులు పుష్పలత, స్వర్ణలత, అరుణలతలు గంగుల కమలాకర్‌తో పాటు వెంకన్న, సుధాకర్‌లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. కుటుంబ సభ్యులు, తదుపరి తరాల వారు కూడా రాఖీ వేడుకల్లో పాల్గొనడంతో గంగుల నివాసంలో పండుగ సందడి నెలకొంది. ప్రతి ఏటా రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులంతా కలుసుకోవడం తమ ఆనవాయితీ అని సోదరీమణులు తెలిపారు.

# నిజాం కళాశాలలో రక్షాబంధన్ వేడుకలు.




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 28; అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) బషీర్బాగ్ నగర శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని నిజాం కళాశాలలో రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. శ్రీనివాస్ గారికి, వైస్ ప్రిన్సిపల్ హారతి గారికి, అలాగే ఇతర ఉపాధ్యాయులకు ఏబీవీపీ నాయకులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం బషీర్బాగ్ నగర కార్యదర్శి సురేందర్ గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. శ్రీనివాస్ గారు, వైస్ ప్రిన్సిపల్ హారతి గారు, నగర అధ్యక్షులు రాజు గారు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏబీవీపీ నాయకులు నగర అధ్యక్షులు రాజు గారితో పాటు కళాశాల ఉపాధ్యాయులకు కూడా రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ భారతీయ సంస్కృతి, సోదరభావం, ఆత్మీయతకు ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు కళాశాల యాజమాన్యం మధ్య స్నేహపూర్వక వాతావరణం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు ప్రతిపాదిత ముసాయిదాను పరిశీలించండి.

## శాసనసభ్యు లందరికీ సిటీజన్స్ కౌన్సిల్ బహిరంగ లేఖ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 28 ; తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగర పాలనను ఆధునీకరించేందుకు 1955 నాటి జీ.హెచ్.ఎం.సీ చట్టం స్థానంలో 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు ప్రతిపాదిత ముసాయిదాను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సమాచారం మేరకు సెప్టెంబర్ రెండవ వారంలో జరగనున్న శాసనసభ సమావేశాలలో ప్రవేశపెట్టనున్న దరిమిలా ది సిటీజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సీతారం దూళిపాల, అందె లక్ష్మణ్ రావు, ఆరీఫ్ మహమ్మద్, బొడ్డు శ్రీధర్, ఆకుల నరేష్ తది తరులందరు గౌరవ శాసనసభ్యు లందరికీ బహిరంగ లేఖ రాశారు. ప్రజా హితవుకోరి శాసనసభ్యులు బిల్లును సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

పాత చట్టం ప్రకారం పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా, పౌర సమస్యలకు అనుగుణంగా సమగ్రంగా పునర్వ్యవస్థీ కరించాల్సిన దానికి బదులు రాజ్యాంగబద్ధ వికేంద్రీకరణ, ఎన్నికైన స్థానిక సంస్థల స్వయం ప్రతి పత్తి, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయకుండా 74వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన పట్టణ స్థానిక సంస్థల హక్కులను హరీస్తూ ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతిపాదిత అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసి స్థానిక సంస్థలపై అధికారం కేంద్రీకరించే విధంగా, ఎన్నికైన కార్పొరేషన్ల స్వయం ప్రతిపత్తికి తూట్లు పొడువడానికి సన్నద్ధం అవుతున్నారు కావున ప్రజల భాగస్వామ్య పద్ధతి ప్రకారం ప్రతి వార్డులో రెండు సంవత్సరాల పదవీకాలంతో సమర్థవంతమైన వార్డు కమిటీలు ఏర్పాటు చేస్తూ అందులో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, సివిల్ సొసైటీ, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, తీర్మానాలను కార్పొరేషన్/స్టాండింగ్ కమిటీ పరిశీలించే మరియు వాటిపై చర్య తీసుకునే విధానం ఉండాలని సూచించారు.

రోజువారీ పౌర సమస్యల పరిష్కారానికి కమిషనర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు తగిన ఆర్థిక, పరిపాలనా అధికారాలను అప్పగించాలని, ప్రభుత్వ విలువలు, వాస్తవ మార్కెట్ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిష్కరించ కుండా క్యాపిటల్ వ్యాల్యు ఆధారిత పన్ను విధానం అమలు చేయడం ద్వారా నిజాయితీగా పన్ను చెల్లించే ప్రజలపై భారం పెరుగుతుంది కావున వార్షిక అద్దె విలువ విధానాన్ని కొనసాగించడం లేదా పారదర్శకమైన, న్యాయమైన ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలని కోరారు.

రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన కార్పొరేషన్ స్థానిక సంస్థ చట్టబద్ధమైన వ్యవహారాలను తానే నిర్వహించుకునే స్వయం ప్రతిపత్తి కలిగి, చట్ట పరిధిలో ఆమోదించిన తీర్మానాలను గౌరవించి అమలు చేయాలని, పదవీ దుర్వినియోగం, తీవ్రమైన ఆర్థిక అవకతవకలు లేదా చట్ట ఉల్లంఘన వంటి అసాధారణ పరిస్థితులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా కార్పొరేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కొరడ మైనది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కార్పొరేటర్లకు తగిన ప్రోటోకాల్, సంస్థాగత పాత్ర, అధికారిక గుర్తింపు చట్టంలో స్పష్టంగా ఉండాలని కొరడ మైనది, మరియు ఎన్నికైన కార్పొరేషన్‌ను సస్పెండ్ లేదా సూపర్‌సీడ్ చేసే అధికారం ఏకపక్షంగా వినియోగించ కుండా స్పష్టమైన చట్టపరమైన విధానం, రక్షణలు మరియు జవాబుదారీతనం ఉండాలని కోరారు.

తదనంతరం ప్రతిపాదిత అప్పీలేట్ అథారిటీకి తగిన ట్రిబ్యునల్ స్థాయి న్యాయ పరమైన అధికారాలు మరియు స్వతంత్రత కల్పించి, మున్సిపల్ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించేలా చేయాలి. అదే సమయంలో ప్రస్తుత బహుళ అంతస్తుల ట్రిబ్యునల్ తో అధికార పరిధి స్పష్టంగా నిర్వచించాలని గౌరవ శాసనసభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# వైరల్ జ్వరాల వేళ యాంటీబయాటిక్స్‌తో జాగ్రత్త

**(హెచ్.ప్రతాప్)**

హైదరాబాద్‌లో వర్షాకాలం ప్రభావంతో వైరల్ జ్వరాలు, ఫ్లూ తరహా అనారోగ్యాలు, ఇతర జ్వర సంబంధిత కేసులు పెరుగుతున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అధిక తేమ, మారుతున్న వాతావరణ పరిస్థితులు, దోమల వృద్ధికి అనుకూలంగా మారిన పరిసరాలు ఈ సీజన్‌లో అనారోగ్యాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఆసుపత్రుల ఔట్‌పేషెంట్ విభాగాలకు జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం, తలనొప్పి, దగ్గు, గొంతు సమస్యలతో వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

అయితే ఈ పరిస్థితిలో మరింత ఆందోళన కలిగిస్తున్న అంశం వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడటం. జ్వరం వచ్చిందంటే వెంటనే యాంటీబయాటిక్ మందు వేసుకోవడం, గతంలో ఉపయోగించిన మందులనే మళ్లీ తీసుకోవడం లేదా ఇతరులకు రాసిన మందులను తమకు తాము వాడుకోవడం ప్రమాదకరమైన అలవాటు. వైరస్ వల్ల వచ్చే జ్వరాలకు యాంటీబయాటిక్స్ పనిచేయవు. అవసరం లేకుండా వాటిని తీసుకోవడం వల్ల దుష్ప్రభావాలతో పాటు యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉంది. దీంతో భవిష్యత్తులో సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకే మందులు పనిచేయని పరిస్థితి ఏర్పడవచ్చు.

మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే వైరల్ జ్వరం, డెంగ్యూ, మలేరియా, ఫ్లూ వంటి వ్యాధుల ప్రారంభ లక్షణాలు ఒకే విధంగా కనిపించవచ్చు. అందువల్ల లక్షణాలను చూసి ఇంట్లోనే వ్యాధిని నిర్ధారించుకోవడం సరైన పద్ధతి కాదు. తాజా వార్తా నివేదికల ప్రకారం, డెంగ్యూ లక్షణాలను పోలిన అనేక కేసుల్లో పరీక్షల అనంతరం ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు బయటపడుతున్నాయి. మూడు రోజులకు మించి జ్వరం కొనసాగితే లేదా పరిస్థితి మరింత తీవ్రమైతే వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం.

ప్రజల బాధ్యత కూడా అంతే కీలకం. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల పెరుగుదలను అరికట్టడం, పరిశుభ్రమైన నీరు తాగడం, చేతులు తరచూ శుభ్రం చేసుకోవడం, రద్దీ ప్రాంతాల్లో శ్వాసకోశ పరిశుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు అవసరం. ముఖ్యంగా "జ్వరం అంటే యాంటీబయాటిక్" అనే అపోహను విడనాడాలి. మందు బలంగా ఉండటం కంటే, సరైన వ్యాధికి సరైన మందు వాడటం ముఖ్యం. వర్షాకాల జ్వరాలను భయపడాల్సిన అవసరం లేదు. కానీ నిర్లక్ష్యం చేయకూడదు. స్వీయ వైద్యం తగ్గించి, శాస్త్రీయ నిర్ధారణ పెంచితేనే వైరల్ జ్వరాల సీజన్‌ను సురక్షితంగా ఎదుర్కోగలం.

# అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 28:** అక్కా తమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతులకు రాఖీలు కట్టి, వారు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సోదరులు కూడా తమ సోదరీమణులకు బహుమతులు



అందించి, జీవితాంతం వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.రక్షాబంధన్ సందర్భంగా చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు రకాల రంగురంగుల రాఖీలు, స్వీట్లు, బహుమతుల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా కనిపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు, సోదరులు సైతం స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకున్నారు.

రాఖీ కట్టడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాకుండా సోదరసోదరీ మణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. కుటుంబ విలువలు, ఆత్మీయ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు

# ఉద్యోగుల ఆరోగ్య పథకం ప్రారంభానికి పటిష్ట ఏర్పాట్లు

## ఆసుపత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ తనిఖీలు

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 28:** జిల్లాలో నూతనంగా అమలు చేయనున్న ఉద్యోగుల ఆరోగ్య పథకం ప్రారంభానికి ఆసుపత్రుల్లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ పరిశీలించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు సులభంగా అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు.




ఈ సందర్భంగా కూకట్‌పల్లిలోని రెమెడీ ఆసుపత్రి, బీబీఆర్ ఆసుపత్రి, మెడిసిటీ ఆసుపత్రులను డా. కె. ఆనంద్ సందర్శించారు. ఆయా ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, సమాచార--విద్య--ప్రచార సామగ్రిని పరిశీలించారు. పథకానికి సంబంధించిన వివరాలు లబ్ధిదారులకు స్పష్టంగా అర్థమయ్యేలా ఏర్పాట్లు చేశారా లేదా అనే అంశాలను సమీక్షించారు.

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు పథకం ద్వారా అందే వైద్య సేవలు, చికిత్సా సౌకర్యాలు, నగదు రహిత వైద్య సేవలపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రత్యేక కౌంటర్ల వద్ద లబ్ధిదారులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పథకం ప్రారంభమైన అనంతరం లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని డా. కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో పథకానికి సంబంధించిన సమాచారాన్ని ప్రముఖంగా ప్రదర్శించడంతో పాటు, అవసరమైన సూచనలు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడమే ప్రధాన లక్ష్యమని డా. కె. ఆనంద్ పేర్కొన్నారు. పథకం అమలులో ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు.

# నియోజకవర్గ పరిధిలోని ఎక్కడి కక్కడే అక్రమ షెడ్లపై కొరడా...

## శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని సర్వేనెంబర్ 44/4లో మియాపూర్‌లోజీహెచ్ఎంసీ అధికారుల కూల్చివేతలు.సస్పెండ్ అయిన గడ్డం శీను మళ్లీ ప్రత్యక్షం

**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 28** శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని మియాపూర్ బీకే ఎన్ క్లే రోడ్డు పక్కన రెండు పెద్ద షెడ్లు నిర్మాణం




జరుగుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులకు సమాచారం వెళ్లిపోవడంతో అక్రమ షెడ్లను తొలగిం చేందుకు అధికారులు నేరుగా జెసిబి తీసుకొచ్చిషెడ్లుతొలగించడం జరిగింది.

అక్రమ షెడ్లను ఎట్టి పరిస్థితుల్లో తొల గిస్తామన్న వాదనలు వినిపిస్తున్నప్పటి కీ,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లను అధికారులు శుక్రవారం రోజు డెమాలిషన్ యంత్రాలతో కూల్చివేశారు.



అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు,నిబం ధనల ఉల్లంఘనలను పరిశీలించిన అనంతరం అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవల కొన్ని పత్రికలలో చందానగర్ జిహెచ్ఎంసి లో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తూ, ఇతనిపై పలు ఫిర్యాదులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు సస్పెండ్ చేసినట్లు వాళ్లు ప్రింట్ మీడియాలలో వార్తలు ప్రచురిత మై వారం గడవకముందే మళ్లీ గడ్డం శీను కూల్చివేతల దగ్గర దర్శనం కావడం చాలా మంది జీర్ణించుకోలేక పోతున్నారు.

# ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు.

బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్యపరిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# రాఖీ పండుగను చిన్నారులతో కలిసి జరుపుకున్న కలెక్టర్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 28:** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ప్రభుత్వ బాలసదనం బాలబాలికలు జిల్లా కలెక్టర్ మనుచౌదరి గారికి రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాలసదనం పిల్లల కోసం ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి, వారికి స్వీట్లు మరియు కొత్త దుస్తులను అందజేశారు. పిల్లలతో కలిసి భోజనం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి అవసరాలను తెలుసుకున్నారు.

పిల్లల చదువు, ఆరోగ్యం మరియు సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ గారు తెలిపారు. పిల్లల విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, బాలక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం తదితర అధికారులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు బాలసదనం పిల్లలు రాఖీలు కట్టడం, పిల్లలతో కలిసి భోజనం చేసి వారికి స్వీట్లు, కొత్త దుస్తులు అందించడం ద్వారా అధికారులు పిల్లలకు ఆప్యాయత, భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమం బాలసదనం పిల్లల్లో ఆనందాన్ని నింపింది.

# ప్రేమానుబంధాలను చాటిన రాఖీ పండుగ

## సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన సోదరీమణులు



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 28:** సోదరసోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు వేములవాడ పట్టణంలో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. సోదరులు సైతం తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందించి ఆప్యాయతను చాటుకున్నారు.

పండుగ నేపథ్యంలో పట్టణంలోని మార్కెట్లలో రాఖీలు, స్వీట్లు, పండ్లు, బహుమతుల కొనుగోళ్లతో సందడి నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల డిజైన్లతో కూడిన రాఖీలు అందుబాటులో ఉండటంతో మహిళలు, యువతులు తమ సోదరుల కోసం ప్రత్యేకంగా రాఖీలను ఎంపిక చేసుకున్నారు.

రాఖీ పండుగ సోదరసోదరీమణుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని పలువురు పేర్కొన్నారు. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా నిలుస్తాననే భరోసాకు, సోదరి తన సోదరుడి క్షేమాన్ని కోరుకునే ఆత్మీయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.పండుగ సందర్భంగా పలుచోట్ల కుటుంబ సభ్యులు ఒకచోట చేరి రాఖీలు కట్టించుకోవడం, స్వీట్లు పంచుకోవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. సంప్రదాయాలు, కుటుంబ విలువలను భావితరాలకు అందించడంలో రక్షాబంధన్ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు అన్నారు.

# సామూహిక యజ్ఞోపవీత ధారణ.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 28 ఆగస్టు 2026**పద్మశాలి సామాజిక వర్గ ఆరాధ్య దైవమైన శ్రీ భావనా ఋషి జగత్కల్యాణం కోసం శ్రీ మహావిష్ణువు నాభి కమలం (పద్మం) నుండి నూలు పోగులతో (దారంతో) వస్త్రం నేసిన శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా, నూలి పున్నమిగా, రాఖీ పౌర్ణమిగా ప్రసిద్ధి కాగా, ఇదే చారిత్రక పద్మశాలీల నూలు పుట్టుకకు నాంది అని, గాయత్రీ మంత్రం పఠిస్తూ కొత్త జంధ్యం/ యజ్ఞోపవీతాన్ని ధరించడమునె ఉపాకర్మ అంటారు, అట్టి యజ్ఞోపవీత ధారణ మణికొండ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రోజున





పంచవటి కాలనీలో గల శ్రీ లలితా సమేత కామేశ్వర ఆలయంలో సామూహికముగా గాయత్రిమాతా పూజానంతరం గావంచడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# డ్యూటీ డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం.

## విచారణ కు ఆదేశం. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశం

## హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ లతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

**జహీరాబాద్, ఆగస్టు 28 ప్రజాఫలం ప్రతినిధి :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స పై వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు తో మాట్లాడారు.



జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి లో జరిగిన ఘటన పై విచారణ కు ఆదేశించారు. ఈ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో ప్రైవేట్ డాక్టర్ ఉండటం, డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్ కేసు నమోదు



**జహీరాబాద్, ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి:** మొగుడంపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని చిరాగ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ వినయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.86,840 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. చట్టవిరుద్ధంగా పేకాట, జూద కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా రాఖీ సందడి



**జహీరాబాద్, ఆగస్టు 28 ప్రజాబలం ప్రతినిధి :** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జహీరాబాద్ నియోజకవర్గంలోని పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అన్నదమ్ములు తమ సోదరీమణులకు బహుమతులు అందజేసి రక్షణగా నిలుస్తామని హామీ ఇచ్చారు. రాఖీ పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రధాన మార్కెట్లు, దుకాణాలు సందడిగా మారాయి. వివిధ రకాల రాఖీలు, స్వీట్లు, బహుమతుల కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది. చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా రాఖీలు కొనుగోలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ కుటుంబ సభ్యులు ఒకచోట చేరి రాఖీ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించారు. శ్రావణి ఉపాకర్మ, రాఖీ పౌర్ణమి వేడుకలతో నియోజకవర్గ వ్యాప్తంగా ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది.



ఘనంగా శ్రావణి ఉపాకర్మ.. రాఖీ వేడుకలు

జహీరాబాద్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలో శ్రావణి ఉపాకర్మ, రాఖీ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్ మందిరంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రావణి ఉపాకర్మ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దేవతలు, మునులు, పితృ దేవతలకు తర్పణాలు సమర్పించారు. అనంతరం గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ నూతన యజ్ఞోపవీతాలను (జంధ్యాలను) ధరించారు.

ఈ సందర్భంగా వేద పండితులు శ్రావణి ఉపాకర్మ ప్రాముఖ్యతను వివరించారు. వేదాధ్యయనం, ఆధ్యాత్మిక సాధనకు ఉపాకర్మ ఎంతో విశిష్టమైనదని తెలిపారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్షాబంధన్ రోజున బస్సులు లేక వేచి ఉన్న మహిళలు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ లో రక్షాబంధన్ సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి బస్సుల కోసం మహిళలు గంటల తరబడి ఎదురుచూసిన బస్సులు రాకపోవడంతో ప్రభుత్వం పై ఆగ్రహించిన మహిళలు రాఖీ పండుగ సందర్భంగా అన్నదమ్ములకు రాఖీ కట్టాలని ఆలోచనతో ఉన్నటువంటి సమయాలలో ప్రభుత్వం బస్సులను ఎక్కువ మొత్తంలో పెంచకుండా మహిళను ఇబ్బంది పెడుతుందని వాపోయారు చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా గంటల తరబడి ఏటూరునాగారం బస్టాండ్ లో వేచి ఉన్న బస్సులు రాని వైనం దీనితో ఆర్టీసీ అధికారులను ములుగు జిల్లాకు మరిన్ని బస్సులు ఏర్పాటుచేసి ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను కోరారు

# క్యూర్ బిల్లుపై చట్టసభలో చర్చించాలని కోరిన ది.సిటీజన్స్ కౌన్సిల్



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 28 ఆగస్టు 2026**తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మహానగర పాలనను ఆధునీకరించేందుకు 1955 నాటి జీ.హెచ్.ఎం.సీ చట్టం స్థానంలో 2026 కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు ప్రతిపాదిత ముసాయిదాను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సమాచారం మేరకు సెప్టెంబర్ రెండవ వారంలో జరగనున్న శాసనసభ సమావేశాలలో ప్రవేశపెట్టనున్న దరిమిలా ది సిటీజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సీతారం దూళిపాల, అందె లక్ష్మణ్ రావు, ఆరీఫ్ మహమ్మద్, బొద్దు శ్రీధర్, ఆకుల నరేష్ తది తరులందరు గౌరవ శాసనసభ్యు లందరికీ బహిరంగ లేఖ వ్రాయడము జరిగింది. ప్రజా హితవుకోరి శాసనసభ్యులు బిల్లును సమగ్రంగా పరిశీలించమనీ కొరడమైనది. పాత చట్టం ప్రకారం పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా, పౌర సమస్యలకు అనుగుణంగా సమగ్రంగా పునర్వ్యవస్థీ కరించాల్సిన దానికి బదులు రాజ్యాంగబద్ధ వికేంద్రీకరణ, ఎన్నికైన స్థానిక సంస్థల స్వయం ప్రతి పత్తి, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయకుండా 74వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన పట్టణ స్థానిక సంస్థల హక్కులను హరీస్తూ ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతిపాదిత అపేక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసి స్థానిక సంస్థలపై అధికారం కేంద్రీకరించే విధంగా, ఎన్నికైన కార్పొరేషన్ల స్వయం ప్రతిపత్తికి తూట్లు పొడువడానికి సన్నద్ధం అవుతున్నారు కావున ప్రజల భాగస్వామ్య పద్ధతి ప్రకారం ప్రతి వార్డులో రెండు సంవత్సరాల పదవీకాలంతో సమర్థవంతమైన వార్డు కమిటీలు ఏర్పాటు చేస్తూ అందులో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, సివిల్ సొసైటీ, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, తీర్మానాలను కార్పొరేషన్/స్టాండింగ్ కమిటీ పరిశీలించే మరియు వాటిపై చర్య తీసుకునే విధానం ఉండాలని సూచించడమైనది. రోజువారీ పౌర సమస్యల పరిష్కారానికి కమిషనర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు తగిన ఆర్థిక, పరిపాలనా అధికారాలను అప్పగించాలని, ప్రభుత్వ విలువలు, వాస్తవ మార్కెట్ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిష్కరించ కుండా క్యాపిటల్ వ్యాల్యు ఆధారిత పన్ను విధానం అమలు చేయడం ద్వారా నిజాయితీగా పన్ను చెల్లించే ప్రజలపై భారం పెరుగుతుంది కావున వార్షిక అద్దె విలువ విధానాన్ని కొనసాగించడం లేదా పారదర్శకమైన, న్యాయమైన ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలని కొరడ మైనది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన కార్పొరేషన్ స్థానిక సంస్థ చట్టబద్ధమైన వ్యవహారాలను తానే నిర్వహించుకునే స్వయం ప్రతిపత్తి కలిగి, చట్ట పరిధిలో ఆమోదించిన తీర్మానాలను గౌరవించి అమలు చేయాలని, పదవీ దుర్వినియోగం, తీవ్రమైన ఆర్థిక అవకతవకలు లేదా చట్ట ఉల్లంఘన వంటి అసాధారణ పరిస్థితులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా కార్పొరేషన్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కొరడ మైనది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కార్పొరేటర్లకు తగిన ప్రోటోకాల్, సంస్థాగత పాత్ర, అధికారిక గుర్తింపు చట్టంలో స్పష్టంగా ఉండాలని కొరడ మైనది, మరియు ఎన్నికైన కార్పొరేషన్‌ను సస్పెండ్ లేదా సూపర్‌సీడ్ చేసే అధికారం ఏకపక్షంగా వినియోగించ కుండా స్పష్టమైన చట్టపరమైన విధానం, రక్షణలు మరియు జవాబుదారీతనం ఉండాలని కొరడ మైనది. తదనంతరం ప్రతిపాదిత అప్పీలేట్ అథారిటీకి తగిన ట్రిబ్యునల్ స్థాయి న్యాయ పరమైన అధికారాలు మరియు స్వతంత్రత కల్పించి, మున్సిపల్ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించేలా చేయాలి. అదే సమయంలో ప్రస్తుత బహుళ అంతస్తుల ట్రిబ్యునల్ తో అధికార పరిధి స్పష్టంగా నిర్వచించాలని గౌరవ శాసనసభ్యులకు విజ్ఞప్తి చేయడమైనది.

## నూతన సమీకృత కలెక్టరేట్ కు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం తరలింపు... డిపిఆర్ఓ రఫీక్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28 కలెక్టరేట్**జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి తరలించినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ--20 గదిని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఇకపై జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ కార్యకలాపాలు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచే కొనసాగుతాయని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అధికారిక సమాచార వ్యవహారాలు, మీడియా సమన్వయం, ఇతర కార్యాలయ కార్యకలాపాలు ఇకపై నూతన ఐడీఓసీ నుంచే నిర్వహించనున్నట్లు డీపీఆర్ఓ ఆ ప్రకటనలో వెల్లడించారు.

## బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది.

### బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28 ములుగు** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు.

"బాలికను చదివిద్దాం--దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం" అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి



రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసా కల్పించారు.

జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమానుబంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతోపాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో జోరుగా జీరో ఇసుక దందా



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28 ఏటూరు నాగారం** ములుగు జిల్లాలోని వెంకటాపురం వాజేడు మంగపేట మండలలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులలోజోరుగా జీరో ఇసుక దందా నడుస్తుందని తెలుస్తుంది ఎలాంటి పేపర్లు లేకుండా రాత్రి వేళలో ర్యాంపుల వద్ద నింపుకున్న జీరో ఇసుక లారీలు ఫారెస్ట్ అధికారుల అండదండతో జిల్లా దాటుతున్నట్లు తెలుస్తుంది చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీల విషయంలో బయటపడిన వాహనాలు ఎన్నో ఉన్నాయి. వాటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు ఇటీవల రోజులలో వెంకటాపురం వాజేడు మంగపేట మండలాలలో నిర్వహిస్తున్న ర్యాంపులలో ఇసుక లారీలలో రాత్రి వేళలో టేకు దుంగలు పెద్ద ఎత్తున తరలి హైదరాబాదుకు చేరుతున్నట్లు సాక్షాలు ఉన్నాయి ముఖ్యంగా చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులకు డబ్బులు ముట్టజెప్పి వాహనాలను మూడో కంటికి తెలియకుండా ములుగు జిల్లా తరలిస్తున్నట్టు తెలుస్తుంది ఇప్పటికైనా జిల్లా ఫారెస్ట్ అధికారి డి ఎఫ్ ఓ రాత్రి వేళలో వెళ్తున్న ఇసుక లారీలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు



## వీయం బంజర ఎస్ ఐ గా ఎస్.కె షాకీర్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28:** వీఎం బంజర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఎస్.కె షాకీర్ బాధ్యతలు స్వీకరించా నున్నారు . బదిలీపై మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన ఆయన విధుల్లో చేరనున్నారు గతంలో సత్తుపల్లి, కల్లూరు తమ సేవలను అందించారు. ఈసందర్భంగాపోలీస్‌సిబ్బందిఎస్ఐ షాకీర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మల్లిబాబు యాదవ్.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 28 ప్రజాబలం:**కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బత్తుల రాంబాబు ఉపేంద్రల కుమారుడు నరసింహారావు చ హరిణి ఖమ్మం నగరానికి చెందిన మల్లెపువ్వు దుర్గాప్రసాద్ శివాని ల కూతురు వివాహం స్థానిక శ్రీనివాస కళ్యాణం మండపంలో జరిగిన వివాహ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి, కలకాలం చల్లగా అన్యోన్య దాంపత్యంతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు విషయంగురించి ప్రస్తావించంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితుల్లో కష్టంగా ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విషయంలో కావాలని జాప్యం చేస్తున్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉందని, అదేవిధంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు కూడా త్వరలో మంజూరవుతాయి అని మల్లి బాబు యాదవ్ తెలిపారు. కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, చల్ల రాజు బత్తుల వీరబాబు మొగిలి శ్రీను చల్ల మల్లయ్య, మంజల సాంబయ్య, గుండ్ల ఏసోబు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28 :**సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.

రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, నుదుటన కుంకుమ దిద్ది, స్వీట్లు తినిపించి తమ ప్రేమను చాటుకున్నారు. దూర ప్రాంతాల్లో నివసించే సోదరీమణులు సైతం సోదరుల ఇళ్లకు చేరుకుని రాఖీలు కట్టి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లను ఆప్యాయంగా ఆదరించి కానుకలు అందజేశారు.

సోదర, సోదరీమణులు జీవితాంతం కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచి, కుటుంబాల సంక్షేమం కోసం పరస్పరం సహకరించుకోవాలని ఈ పర్వదినం చాటి చెబుతుందని పలువురు పేర్కొన్నారు.

సత్తుపల్లి పట్టణంలోని జలగం నగర్ ,కాకర్లపల్లి రోడ్డులోని వెంకటేశ్వర రెసిడెన్సీలో చిన్నారులు సంప్రదాయ పద్ధతిలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి, మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు.

కార్యక్రమంలో సాయి శ్రీరామ్, సంజీత్, దీపక్, రోహిత్, చైతన్య, సుదీక్ష, జ్ఞాపిక, తేజస్విని ,సూర్య ప్రసున , యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని మిఠాయిలు పంచడం జరిగింది

### అందోల్ జోగిపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిట్టిబాబు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 28 ( ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :అందోల్ మండల్ జోగిపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఆధ్వర్యంలో 15వ వార్డులో ప్రతి ఇంటికి రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని ఆడపడుచులకు మిఠాయిలు పంచడం జరిగింది ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరేశం,అడ్డు,తదితరులు పాల్గొని ప్రతి ఇంటింటి మిఠాయి పంచడం జరిగింది ఆడపడుచులకు రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా అందోల్-జోగిపేట,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిట్టిబాబు, మాట్లాడుతూ ఈ సందర్భంగా నా తరపున చిన్న చిరు కానుక పంపించడం జరిగింది 15 వ వార్డులో ఉన్న నా ఆడపడుచులు నా రక్త సంబంధికులు కాకపోయినా వారందరు నా తోబుట్టువులతో సమానం కాబట్టి ఈరోజు రాఖీ బంధన్ సందర్భంగా మీకు మీ కుటుంబ సభ్యులకు పండగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అలాగే అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో



వున్నాఆడపడుచులందరికి, పేరు పేరున రక్షా బంధన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.....

### రోప్ స్కిప్పింగ్‌లో పారమిత విద్యార్థుల సత్తా

కరీంనగర్ ఆగస్టు 28 హైదరాబాద్ అల్మాస్‌గూడలో ఈ నెల 23న తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-10 విభాగంలో 3వ తరగతి విద్యార్థి సి.హెచ్. ఈశ్వర సాయి, అండర్-8 విభాగంలో 2వ తరగతి విద్యార్థి డి. నిఖిల్ బంగారు పతకాలు సాధించగా, అదే విభాగంలో ఎం. శ్రేయాన్స్ కాంస్య పతకం సాధించాడు. విజేతలను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

# బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి..

### సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి బి ఎల్ ఎ సమావేశంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్...

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28** :సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల జాబితాపై బూత్ స్థాయి నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు.

సత్తుపల్లి పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వారి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణ పరిధిలోని బూత్‌ల వారీగా పార్టీ కార్యక్రమాలు, ఓటర్ల జాబితా పరిశీలన, బూత్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు.

ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాతినిధ్యం ఉండేలా బిఎల్ఎ లు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై అప్రమత్తంగా



ఉండడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా నమోదయ్యేలా కృషి చేయాలని పేర్కొన్నారు. సర్ ప్రక్రియపై కూడా బిఎల్ఎ లకు పలు సూచనలు, అవగాహన కల్పించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సర్ ఇన్‌చార్జి దైద రవీంద్ర హాజరయ్యారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఐదు మండలాల మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, బిఎల్ఎలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.




# వేంసూర్ ఎస్ఐగా పి. ప్రదీప్ బాధ్యతల స్వీకరణ..

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 28:** వేంసూర్ పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా పి. ప్రదీప్ బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై సత్తుపల్లి నుండి వేంసూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన శుక్రవారం విధుల్లో చేరి అధికారికంగా చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐ పి. ప్రదీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సీసీ కెమెరాల సాయంతో పోయిన బంగారం గుర్తింపు

### ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయా గ్రామ సర్పంచులను కోరిన ఎస్ఐ,ఎన్,విశ్వజన్,

**ఆందోల్ నియోజకవర్గశీ ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** పుల్కల్ : ఆటోలో ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్న బంగారు నగలు, నగదును సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు పుల్కల్ పోలీసులు తెలిపారు. పుల్కల్ మండలం గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన పోస్టుమాన్ రమావత్ అమర్సింగ్,కుటుంబం ఆటోలో ప్రయాణిస్తుండగా సుమారు 15 తులాల బంగారు నగలు, రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్ ఉన్న బ్యాగు రోడ్డుపై పడిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గంగోజిపేట, తాడ్దానిపల్లి పరిసరాల్లోని సీసీ





కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.సీసీ కెమెరాల ఆధారంగా ఇషోజిపేట్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు బంగారు నగలు దొరికినట్లు గుర్తించిన పోలీసులు వారిని సంప్రదించి పోయిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు అనంతరం ఎస్ఐ, నల్లా,విశ్వజన్, బాధితుడు అమర్సింగ్‌కు, బంగారు నగలను అప్పగించారు,దీంతో బాధిత కుటుంబం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.ఈసందర్భంగా ఎస్ఐ ,విశ్వజన్,మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామాల సర్పంచ్‌లను కోరారు,సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు తప్పిపోయిన వస్తువులు, వ్యక్తుల ఆచూకీ గుర్తించడంలో కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు...


# రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కి రాఖీ కట్టిన మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్ళు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 28 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహకు, రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని మంత్రి సీతక్క, మరియు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారుఈసందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రి సీతక్కను,కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకుర్రాళ్లను ఆశీర్వదించారు. వారు ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలనిఆకాంక్షించారు.రాఖీ పౌర్ణమి సోదరసోదరీమణుల మధ్య ఆత్మీయత, అనురాగం,అనుబంధానికి ప్రతీక అని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈపవిత్రమైన, బంధం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలనిఆకాంక్షించారు



# హైదర్నగర్ లోని శాకాంబరీ దేవిగా జయదుర్గా మైసమ్మ అమ్మవారి విశేష అలంకరణ జరిగింది:ఈవో సతీష్బాబు



**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 28** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్లో గల స్వయంభూ దేవాలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ జయదుర్గా మై సమ్మ దేవాలయంలో శ్రావణ మా సం 3వ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకాంబరీ దేవిగా వి విధ రకాల కూరగాయలు,పండ్లు మరియు పుష్పాలతో అత్యంత వైభవోపేతంగా ఇక్కడి పురోహితు లు అలంకరించారు.ఈ సందర్భం గా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయా నికి విచ్చేసి అమ్మవారి శాకాంబరీ అలంకారాన్ని దర్శించుకుని నిష్ఠతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి శుక్రవారం ఆలయంలో నిర్వ హిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా ఈ శుక్రవా రం కూడా సుమారు 800 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేయడం జరిగిందన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు,అర్చకులు మరియు సిబ్బంది ప్రత్యేక ఏర్పా ట్లు చేశారు.శ్రావణ మాసం మొదటి శుక్రవారం అమ్మవారికి గాజులతో అలంకరణ, రెండవ శుక్రవారం డబ్బులతో ప్రత్యేక అలంకరణ, మూడవ శుక్రవారం శాకాంబరీ అలంకరణ నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రానున్న నాలుగవ,ఐదవ శుక్రవారాల్లో కూడా అమ్మవారికి పండ్లు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సం ఖ్యలో విచ్చేసి స్వయంభూ శ్రీ మై సమ్మ తల్లి,శ్రీ జయదుర్గా మైసమ్మ అమ్మవారు,నాగదేవత,శ్రీ గణపతి స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామివా ర్లను దర్శించుకుని వారి దివ్య ఆశీ స్సులు పొందాలని ఆలయ కార్య నిర్వహణాధికారి కోరారు.శాకాంబరీ అలం కరణ కార్యక్ర మాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ నిర్వాహకులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కార్యక్రమా నికి విచ్చేసిన భక్తులకు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు,అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలకు, అర్చకులకు,ఆలయ సిబ్బందికి,సేవకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియ జేశారు.భక్తుల సహకారం, అమ్మ వారి అనుగ్రహంతో శ్రావణ మాసం లోని మిగిలిన శుక్రవారాల ప్రత్యేక అలంకరణలు,పూజా కార్యక్రమా లను కూడా ఘనంగా నిర్వహిస్తా మని ఆలయ కార్యనిర్వహణాధి కారి తెలిపారు.ఈ కార్యక్రమంలో సతీష్ బాబు,కార్యనిర్వ ణాధికారి, తో పాటు జై దుర్గ మైసమ్మ ఆల య ప్రధాన అర్చకులు అర్చకులు శ్రీచంద్రశేఖర్,నవీన్ కుమార్ స్వామి ఆలయ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# రాఖీ కట్టిన కార్మిక మహిళలు.. కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్ రెడ్డి



, గోదావరిఖని రాఖీ పండుగను పురస్కరించుకొని శుక్రవారం నాడు ఓల్డ్ అశోక్ మేస్త్రి అడ్డా టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక మహిళలు హరీష్ రెడ్డి గారికి రాఖీలు కట్టి ఆశీర్వదించారు.హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రానున్న రోజుల్లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు మహిళలు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టాపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దిగువ యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, బక్కి కిషన్, కృష్ణస్వామి, చొప్పరి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, మేకల రామస్వామి, రంగు దుర్గాప్రసాద్, బోట్ల పోషం, రౌతు గణేష్, రిషి, మామిడాల రాము, బోడకుంట వెంకటలక్ష్మి, కడార్ల శ్రీధర్, బండి రాజు, దిడ్డి కుమార్, కొండ సురేష్, నిజం, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com